


www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




సంపుటి 09, సంచిక: 182 | మంగళవారం | 02-06-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# ఐపిఎల్ 2026 ఏమి సాధించింది?

క్రికెట్ క్రీడా ప్రపంచంలో మేటి లీగ్‌గా రాణిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 19వ ఎడిషన్ ఆదివారం రాత్రి నరేంద్ర మోదీ స్టేడియంలో దాదాపు లక్ష మంది ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య, విజేతగా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సిబి) అత్యంత ప్రతిష్టాత్మకమైన తళతళ మెరిసే కప్పును వరుసగా రెండవ సంవత్సరం అందుకుంది. అటువంటి కీర్తి సాధించిన చెన్నై సూపర్ కింగ్స్ (2010, 2011), ముంబై ఇండియన్స్ (2019, 2020) సరసన చేరింది. 18 సంవత్సరాల నిరీక్షణ తదుపరి గత సంవత్సరం తొలిసారి రజత్ పటిదార్ కెప్టెన్సీలో కప్పు అందుకున్న ఆర్సిబి ఈ వరుస విజయం ద్వారా ప్రస్తుతం తమదే మేటి జట్టు అని నిరూపించుకుంది. ఈ విజయంలో సాపేక్షికంగా గతతరం హీరో విరాట్ కోహ్లి టాప్ స్కోరర్‌గా (42 బంతుల్లో 75 పరుగులు) ఆర్సిబి విజయంలో కీలకపాత్ర పోషించడం విశేషం. ఫైనల్ పోటీలో ఓడిన శుభమన్‌గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ తక్కువ జట్టేమీ కాదు. తొలి క్వాలిఫయర్‌లో ఆర్సిబి చేతిలోనే ఓడిన ఈ జట్టు ఎలిమినేటర్ మ్యాచ్‌లో బలమైన రాజస్థాన్ రాయల్స్‌పై గెలుపొంది అంతిమంగా ఆర్సిబితోనే తలపడింది. వారి ఓపెనింగ్ జోడి గిల్, సుదర్శన్ ఈ టోర్నీలో కనీసం 7 సార్లు 100 పరుగుల భాగస్వామ్యం అందించిన మేటి. అయితే తమ సొంత అహ్మదాబాద్ స్టేడియంలో వారి దూకుడు ఆట బెడిసి కొట్టి 8 వికెట్లకు 155 పరుగులతో ఇన్నింగ్స్ ముగిసింది. ప్రత్యర్థి బౌలర్లు హాజిల్ ఉడ్, భువనేశ్వర్ కుమార్ కొత్త బంతి అటాక్ పవర్ ప్లే లోపలే ఆ ఆరంభ ఆటగాళ్లిద్దరినీ పెవిలియన్‌కు పంపటంతోనే ఆట తీరు మారిపోయింది. ఓటమి ఎదురుచూస్తున్నట్లయింది.

జట్టు సమతుల్యం ప్రాధాన్యతకు ఈ 2026 సీజన్ తిరిగి బలం చేకూర్చింది. బ్యాటర్స్‌కు అనుకూలంగా –ప్రేక్షకులకు, వీక్షకులకు వినోదదాయకంగా రూపొందించిన ఐపిఎల్ ఫార్మాట్‌లో బౌలర్లు కూడా మ్యాచ్ విన్నర్లుగా నిరూపించుకున్నారు. ఆ ఘనత ప్రధానంగా విదేశీ బౌలర్లకే చెందుతుంది. గుజరాత్ టైటాన్స్‌కు ఆడిన కసిగో రబడ 17 మ్యాచుల్లో 29 వికెట్లు తీసి టాప్ బౌలర్‌గా పర్పుల్ టోపీ అందుకున్నారు. భారత్ బౌలర్లలో స్వింగ్ బౌలర్ భువనేశ్వర్ కుమార్, మొహమ్మద్ సిరాజ్ రాణించారు.

ఈ సీజన్‌లో అందరి చూపులు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపైనే. అతడొక అద్భుతం. సచిన్ టెండూల్కర్ 16వ ఏట భారత క్రికెట్ క్షేత్రంలో అడుగుపెట్టిన సెన్సేషన్ అయితే సూర్యవంశీ అంతకన్నా పిన్న వయసులోనే టీ20 క్రికెట్‌లో ఐపిఎల్‌లో చరిత్ర సృష్టించాడు. ఎంతటి బౌలర్ అన్నా భయం లేదు. వారి తొలి బంతినే బౌండరీలకు తరలించాడు. బిహార్‌కు చెందిన ఈ కొత్త సెన్సేషన్ ఇండియా జట్టులోకి పిలుపుకు సిద్ధంగా ఉన్నట్లు చాటి చెప్పాడు. ఇప్పుడిక సెలెక్టర్ల వంతు. టి20, 50 ఓవర్ల వన్డే ఇంటర్నేషనల్ భారత జట్టులో తక్షణం స్థానం దక్కకపోతే సెలెక్టర్లు అన్యాయం చేసినవారవుతారు. ఈ ఐపిఎల్ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్‌కు ఆడారు. 16 మ్యాచుల్లో 776 పరుగులతో టాప్‌స్కోరర్‌గా ఆరెంజ్ క్యాప్ అందుకున్నారు. సూపర్ స్ట్రైకర్, ఎమర్జింగ్ ప్లేయర్, అత్యధిక సిక్స్‌లు రికార్డులు అతనివే.

ఒకప్పుడు ఇండియా టీం, టెస్టులు, ఆ తర్వాత 50 ఓవర్లకే పరిమితమైన క్రికెట్ క్రీడ జనాకర్షణ కోల్పోవడంతో 20 ఓవర్ల పోటీలు మొదలై ప్రాచుర్యం పొందుతున్నాయి. ఐపిఎల్ లీగ్‌కు రూపకల్పన వల్ల ఎందరో ఔత్సాహిక క్రీడాకారులకు అవకాశాలు లభిస్తున్నాయి. వేలం పద్ధతి వల్ల కొందరు అనూహ్యంగా కోటీశ్వరులవుతున్నారు. అన్నిటికీ మించి అనుభవజ్ఞులైన విదేశీ క్రీడాకారులతో కలిసి డ్రెస్సింగ్ రూమ్, డగ్‌ఔట్ పంచుకోవడం, కలిసి ఆడటం వల్ల యువ ప్రతిభులు తమ ఆటను మెరుగుపరుచుకోగలుగుతున్నారు. అలా తమ అవకాశాలను మెరుగుపరచుకున్న వారిలో సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రసిక్‌ధార్, కుమార్ కుషాగ్ర, నిశాంత్ సింధు, విగ్నేష్ తదితరులున్నారు. గాయాలపాలైన బ్యాటర్లు ఆయుష్‌మాత్రే, ఉర్విల్ పటేల్ భవిష్యత్తు ఉన్న క్రికెటర్లే.

ఐపిఎల్ ఫ్రాంచైజీలు పూర్తిగా బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఒక్కొక్క ఫ్రాంచైజీ విలువ వందల కోట్లకు చేరింది. ఇప్పుడు ఓనర్‌షిప్ గ్రూపులు ఫ్రాంచైజీలను నడుపుతున్నాయి. ఆర్సిబి గ్రూప్ డియాగో ఛత్రి కింద యునైటెడ్ స్పిరిట్స్ గ్రూప్ కింద ఉంది. ముంబై ఇండియన్స్‌కు రిలయన్స్ ఇండస్ట్రీస్, చెన్నై సూపర్ కింగ్స్‌కు సిఎస్‌కె క్రికెట్ లిమిటెడ్, గుజరాత్ టైటాన్స్‌కు టొరెంట్ గ్రూప్ యజమానులు. రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్, సన్ రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్– ఇవి కూడా ఆధునిక కార్పొరేట్ యజమానులవే. ఈ ఫ్రాంచైజీలు అంతర్జాతీయ ప్రతిభను భారత్‌లోకి తేవడం వల్ల అవి ప్రపంచంలో ప్రసిద్ధి పొందిన ఫుట్‌బాల్ లీగ్‌లస్థాయి సంతరించుకున్నాయి. పోటీ ప్రతిభను వెలికితీస్తుంది. అదే క్రీడాభివృద్ధికి తొలిమెట్టు.

ఐపిఎల్ వచ్చే సీజన్ పలువురు కొత్త కెప్టెన్లు, ఎందరో కొత్త క్రీడాకారులను పరిచయం చేయనుంది. అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్ ఫార్మాట్లలో అగ్రస్థానంలో నిలవడమే లక్ష్యంగా ముందుకు సాగాలి. అదే సమయంలో ఇతర క్రీడల అభివృద్ధికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలి. ●



## మోదీ సర్కార్... ప్రజా విశ్వాసం కోల్పోయింది..

తమను అధికారంలోకి తీసుకురావడానికి ఓటు వేసిన ప్రజల నమ్మకాన్ని మోదీ ప్రభుత్వం కోల్పోయింది. అన్ని రంగాల్లోనూ విఫలమైంది. రోజురోజుకూ మోదీ గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర అన్ని వస్తువుల ధరలను పెంచుతున్నారు. బహుశా, ఆయనకు దేశం పట్ల ఏమాత్రం చింత లేనట్లుంది. ప్రధాని మోదీ ప్రజలను ప్రభావితం చేయడానికి కేవలం వాక్చాతుర్యాన్ని ఉపయోగిస్తారు తప్ప, అత్యవసర సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలను అందించడంలో విఫలమయ్యారు. కేవలం మాటలు తప్ప, ప్రజల గురించి వారికి ఏమాత్రం చింత లేదు'.

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



## ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలి

ప్రభుత్వ విద్య మసకబారుతుందని, ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని, విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యల పరిష్కారమే మార్గమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(AISF) భావిస్తుంది.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయితే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. ఆర్భాటంగా ఫ్లెక్సీ పెట్టి, ఫోటో దిగి, బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలకు రారు. ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించి, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ అభిప్రాయపడుతుంది. తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ విద్యపై దృష్టి సారించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి మూడు సంవత్సరాల కావస్తున్నా కనీసం విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ విద్యా రంగంపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలి. ప్రభుత్వ విద్యా విధానం రాజ్యాంగం కల్పించిన విద్య హక్కు. ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత నిర్వీర్యం చేయడంతో సామాన్యులకి విద్య అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ విద్యను కాపాడడం అంటే కేవలం ఉచిత విద్యను అందించడమే కాదు పేద బడుగు, బలహీన వర్గాలకు సాధికారిత. విద్యార్థులకు టెక్నాలజీ చేరవేయడం విద్యను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు, డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రాంలు కంప్యూటర్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అదే గ్రామంలో ఉన్న ఉద్యోగులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాల్సిన బాధ్యత తీసుకొని గ్రామాలలో తల్లిదండ్రులకు విశ్వసనీయత కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యాబోధన పద్ధతులు మారాలి. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంటుంది. ప్రైవేట్ కార్పొరేట్ విద్య పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఖరీదైనది కాబట్టి పేదలు ప్రైవేట్ విద్యను వదిలేయాల్సిన పరిస్థితి వస్తుంది. పేదలకు అందుబాటులో ఉండదు. ఇది సమాజంలో అసమానతలు పెరగడానికి దారితీస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆధునీకరించబడతాయి. ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేయడం వలన భవిష్యత్తు తరాలకి ప్రభుత్వ విద్య ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇది కేవలం విద్యా వ్యవస్థ పైనే కాదు సమాజంలో అసమానతలు, సమాజపు సమగ్రతపై, సమానత్వంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

ఇటికాల రామకృష్ణ
AISF జాతీయ కార్యవర్గ సభ్యులు
8106146993

# నాగరికతనే నాశనం చేస్తానన్నవాణ్ని క్షమించొచ్చా?



డాక్టర్ దేవరాజు మహారాజు

ఊరికే ఊహించుకోండి ! ఇరాన్ వాషింగ్టన్ డి.సి.మీద బాంబులేసి, వారి అధ్యక్షుణ్ణి, అతని కుటుంబాన్ని, డిప్లమేట్లను, రాజకీయ నాయకుల్ని, జనరల్స్‌ని అందరినీ చంపారని అనుకుందాం. అప్పుడు మీరేమంటారూ? అది ఉగ్రవాదుల చర్య అని అంటారా? అనరా? మరి అదే – వాస్తవంగా ఇరాన్ మీద జరిగింది కదా? ఇరాన్ రాజధాని టెహ్రాన్ మీద బాంబులేసి, వారి సుప్రీం లీడర్ రుహొల్లా ఖొమేనిని అతని కుటుంబాన్ని, డిప్లమేట్లను, జనరల్స్‌ను, రాజకీయ నాయకుల్ని – అందరినీ చంపేస్తే... దాన్ని మాత్రం మీరు ఉగ్రవాద చర్య అని అనరు. ప్రపంచాన్ని రక్షించడానికి చేపట్టిన దాడి అని – అందంగా ముసుగేసుకుంటారా? ఇకనైనా ముసుగు తొలగించుకోవాల్సిన అవసరం లేదా? నాగరికతనే నాశనం చేస్తానన్న వాణ్ణి క్షమించొచ్చా?

నాగరికతను నాశనం చేస్తాననడం ఎంత పెద్ద మాట? ఎంతటి చారిత్రక తప్పిదం? విజ్ఞత, వివేకం గలవాడు మాట్లాడాల్సిన మాటేనా? ఎంత అమెరికా అధ్యక్షుడయినా, ట్రంప్ ఆలోచనా పరుడు కాదు. మేధావి కాదు. ఒక రియల్‌ఎస్టేట్ వ్యాపారి. డబ్బు మదంతో ఏదైనా చేసెయ్యగలను అన్న అహంకారం తప్ప, అందులో ఇసుమంతైనా వివేకం లేదు. మానవ నాగరికతను నాశనం చేసి, ఏమైపోదామని ఈ ఆరాటం? అతణ్ణి ఎగదోసేందుకు ఓ మత పిచ్చిగాడు బెంజిమన్ నెతన్యాహూ తోడయ్యాడు. ఏ దేవుడూ ఎవడికీ ఏ భూమీ రాసివ్వలేదు. ఈ భూమి అందరిది. ఈ గాలి అందరిది. ఈ ప్రకృతి అందరిది. ఆర్థిక లావాదేవీలంటే ఒప్పందాలు చేసుకోవాలి తప్ప, నాగరికతల వినాశనం దాకా పోకూడదు. ఆ హక్కు ఎవడికీ లేదు. ప్రపంచ నేతలే కాదు, వారి అమెరికా సెనెటర్‌లు అధ్యక్షుడి చర్యల్ని ఛీకొడుతున్నారు. అమెరికా పౌరులు, ఇజ్రాయెల్ పౌరులు – మిలయన్ల సంఖ్యలో రోడ్లమీదకొచ్చి వారి నేతల నిర్ణయాల్ని తీవ్రంగా నిరసించారు. వాటిని అర్థం చేసుకుని స్వీకరించాలి కదా? మానవ జాతిని మట్టుబెట్టి ఎవడు మాత్రం ఏం బావుకుంటాడు? ఆలోచించుకునే పనిలేదా? మూఢత్వంతో కళ్ళు మూసుకుపోయిన వారికి ఇలాంటి వేవీ కనబడవన్నమాట!

'అమెరికాది ఉగ్రవాదం' అని అని ఉత్తర కొరియా సుప్రీంలీడర్ కిమ్‌జోంగ్‌ఉన్ బాహాటంగా ప్రకటించాడు. అతను ఇంకా ఇలా అన్నాడు : అమెరికాది ప్రపంచ స్థాయి రాజ్య ఉగ్రవాదం. అది చేస్తున్నవన్నీ దురాక్రమణలు – అందువల్ల, అమెరికా వ్యతిరేక కూటమిలో మా ఉత్తర కొరియా మరింత బలమైన పాత్ర పోషిస్తుంది, అని.

శత్రువులు శాంతియుత సహజీవనాన్ని కోరుకుంటారా? లేక ఘర్షణను ఎంచుకుంటారా? అనేది వారి ఇష్టం! వారు ఏది కోరుకున్నా దానికి ధీటుగా బదులిచ్చే స్థితిలో తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన కిమ్ జోంగ్ ఉన్, ట్రంప్ గురించి మరో మాట కూడా ధైర్యంగా, స్పష్టంగా ఈ ప్రపంచానికి తెలియజేశాడు. మానసిక సమతుల్యత కోల్పోయిన ఒక వృద్ధ అమెరికన్ డొనాల్డ్ ట్రంప్! చిత్త వైకల్యంతో (DEMENTIA)తో బాధపడుతున్న రోగి– అని కూడా అన్నాడు. బాలిస్టిక్ మిస్సైల్ కన్నా తీవ్రమైన స్థాయిలో ఇరాన్ విదేశాంగ మంత్రి సయీద్ అబ్బాస్ అరగ్చి, ట్రంప్‌కు జవాబిచ్చాడు.

మేం ఏమని, ఎలాగని అమెరికాతో ఒప్పందాలు చేసుకోగలం? అంటూ ట్రంప్ చెప్పిన మాటల్నే తిరిగి చెబుతూ.. ట్రంప్ ముఖం పగిలేలా జవాబిచ్చాడు. 'మా దేశానికి నాయకత్వం లేదు. మాకు న్యూక్లియర్ ప్రోగ్రాంలేదు. మాదగ్గర మిస్సైల్స్ స్టాక్ లేదు, ఆయుధాల తయారీ ఆగిపోయింది. మా నావికాదళం పూర్తిగా ధ్వంసమైంది. అసలు ప్రపంచ పటంలో మా ఉనికే లేదు.

ఇక మేం ఏ విషయంలో ఎవరితో చర్చలు జరపాలి? ఏ ఒప్పందాలు చేసుకోవాలి?' అని అన్నాడు అరగ్చి. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేశామని ప్రకటించినందుకు, దానికి ప్రతిస్పందనగా – ఇరాన్ విదేశాంగ మంత్రి అలా జవాబిచ్చాడు. లేశమాత్రమైనా లజ్జగలవాడైతే, ఈ పాటికి ట్రంప్ ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాలి. లేదా తనను తాను కాల్చుకుని ఆత్మహత్య అయినా చేసుకోవాలి. అది లేకనే కదా ఈ యుద్ధాన్ని ముందేసుకుని, ప్రపంచాన్ని కష్టాలపాలు చేశాడు? అతనికి లేకపోతే లేకపోయింది. పోనీ, అమెరికన్ పౌరులకు, అక్కడి వ్యవస్థలకు, కోర్టులకైనా ఇంత ఇంగిత జ్ఞానం ఉంటే అతణ్ణి తక్షణం ఆ పదవి నుండి లాగి రోడ్డున పడేయాలి కదా?



యుద్ధంతో సంబంధం లేని, ప్రపంచంలోని ఇతర దేశాల సామాన్య పౌరులకే రక్తం మసలుతూ ఉంటే, ఇక ఇరాన్ పౌరులకు ఎలా ఉండాలి? అంతర్జాతీయ చట్టాలన్నీ చచ్చాయి. లేదా చచ్చుబడిపోయాయి. అవి అగ్రరాజ్యాలకు మద్దతు నిస్తూ, నిశ్శబ్దంగా ఉండిపోయాయి. లేకపోతే గాజా గురించి, ఉక్రేన్ గురించి ఎందుకు మాట్లాడవూ? కనీసం, ఫ్రాంక్ వాల్టర్ స్టెయిన్ మియర్, జర్మనీ అధ్యక్షుడు ఇరాన్ మీద జరిగే దాడుల్ని ఖండించాడు. అంతర్జాతీయ చట్టాలకు విలువనిచ్చేవారు గొంతెత్తి మాట్లాడాలి కదా?

''చరిత్రలో ఏ దేశం కూడా అణ్వాయుధాలున్న అతిశక్తిశాలి అయిన ఒక అగ్రరాజ్యానికి ఎదురొడ్డి నిలిచింది లేదు. అయితే, వాళ్లు అనుకున్నది ఏ ఒక్కటి కూడా సాధించనీయకుండా ముప్పతిప్పలు పెట్టిన దేశం మాది తప్ప, ఈ భూమి మీద మరొకటి లేదు. దీన్ని మేం మానవత్వంతో ఎదుర్కొన్నామని సగర్వంగా చెప్పుకోగలుగుతున్నాం'' – అని ప్రకటించాడు ఇరాన్ విదేశాంగ మంత్రి సయీద్ అబ్బాస్ అరగ్చి. ధైర్యంగా ఎదుర్కోవడమే కాదు, మానవీయ విలువలతో తమ ప్రజల్ని ఆదుకుంది అక్కడి ప్రస్తుత ప్రభుత్వం. ఇరాన్ సూపర్ మార్కెట్లలో ప్రజలకోసం ఇలా బోర్డులు పెట్టారు. TAKE NOW, PAY AFTER THE WAR – అంటే, సరుకులు ఇప్పుడు తీసుకోండి. యుద్ధం తర్వాత డబ్బులు చెల్లించండి – అని చెప్పడమన్నమాట! సమైక్యతకు, జాతీయ భావనకు – దేశ ప్రేమకు ఇంతకన్నా మరో మంచి ఉదాహరణ లభించదు. ఈ భూమి మీద ఇంకా కొంత మంచితనం, మానవత్వం మిగిలే ఉంది – అని చెప్పడానికి ఇదొక ఉదాహరణ!

ప్రపంచ దేశాల నేతలంతా ట్రంప్‌ను, నెతన్యాహూను అంతర్జాతీయ స్థాయిలో ఛీ కొడుతున్నారు. అన్యాయాన్ని అన్యాయమని చెప్పగలగడం కూడా ఎంతో సాహసవంతమైన కార్యమైపోయింది. బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా ఏమన్నాడంటే – 'ఈ ప్రపంచం తన స్వంతం అని అనుకుంటున్నాడు ట్రంప్. ఓ రోజు ఇరాన్ మీద దాడులు చేస్తాడు. మరొకరోజు ఐస్‌ల్యాండ్ కావాలంటాడు. దీన్ని ఎవరూ సహించరు. నేను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను.' – అని! నిజమే ట్రంప్ ఒక మానసిక వికలాంగుడు అని అనాల్సి వస్తోంది. ఎందుకంటే, కెమెరా ముందు ప్రపంచమంతా చూస్తూ ఉండగా ఏం చెప్పాడూ? 'ఇరాన్ చమురు నిలువలున్నచోట – ఊరికే – తమాషాకు బాంబులేసి చూస్తాను' – అని కదా అన్నాడు? 'ఇలాంటి పిచ్చివాణ్ణి అమెరికన్లు తమ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు' – 'ఇలాంటి విడ్డూరం ఎక్కడా ఎప్పుడూ చూడలేదండి బాబూ' అని ప్రపంచ పౌరులంతా ఆందోళనపడుతూ ఆశ్చర్యపోతున్నారు.

వేరే దేశాల సంగతి ఎందుకు? వారి అమెరికా సెనేటర్ బర్నీ సాండర్స్ ట్రంప్ ప్రభుత్వాన్ని ఎంతగా విమర్శించాడో చూడండి. 84ఏళ్ల అనుభవజ్ఞుడు, ఈ సీనియర్ రాజకీయ నాయకుడి మాటల్లో ఎంతో నిజం, నిజాయితీ కనిపిస్తున్నాయి – ''అమెరికా టాక్స్ పేయర్స్ కట్టిన పన్నుల డబ్బు తీసుకుపోయి మీరు పాఠశాల పిల్లలమీద బాంబులేస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న వారిని కాల్చి చంపుతున్నారు. ఇదేం పద్ధతి? వారికి విద్యనందించాలి. వీరికి ఆహారం అందించి ప్రాణాలు కాపాడాలి! కానీ, వరసబెట్టి ప్రాణాలు తీస్తున్నారే? గాజాలో 18,500 మంది పిల్లల్ని ఇజ్రాయెల్ చంపేసింది. అందుకు బహుమతిగా అమెరికా ఇజ్రాయెల్‌కు ఇరవై రెండు బిలియన్లు అందించడమే కాకుండా, ఇజ్రాయెల్ చేయాలనుకున్న యుద్ధాన్ని, అమెరికా తన మీద వేసుకునిచేస్తూ ఉందేమిటీ?'' అని.

> 'అమెరికాది ఉగ్రవాదం' అని ఉత్తర కొరియా సుప్రీంలీడర్ కిమ్‌జోంగ్‌ఉన్ బాహాటంగా ప్రకటించాడు. అతను ఇంకా ఇలా అన్నాడు : అమెరికాది ప్రపంచ స్థాయి రాజ్య ఉగ్రవాదం. అది చేస్తున్నవన్నీ దురాక్రమణలు – అందువల్ల, అమెరికా వ్యతిరేక కూటమిలో మా ఉత్తర కొరియా మరింత బలమైన పాత్ర పోషిస్తుంది, అని.

అమెరికాలోని ఇల్లినాయిస్ గవర్నర్ జె.బి. ప్రిట్జ్‌కెర్ ఎంతో ధైర్యంగా సూటిగా ట్రంప్ సుగుణాన్ని వెలికితీసి ప్రపంచానికి చాటాడు. ''ట్రంప్ అనుకుంటాడు – మనం ఆయన్ని నమ్మాలని! ఆయన వెనక ఉన్న ఆర్థిక వనరుల్ని చూసి, స్వతహాగా ఆయన ధనవంతుడని ఆయన మాటలకు విలువనిస్తామా? నిజమే! ఆయన అత్యంత ధనవంతుడే అది ఎందులో? అంటే – కేవలం మూర్ఖత్వంలోనే – '' అని అన్నాడు.

ఒకచోట ఒక చైనా స్కాలర్, ఇజ్రాయెల్ జనరల్ కలుసుకున్నారు. సమకాలీన పరిస్థితులు తెలిసిన చైనా స్కాలర్ ఊరికే ఉండలేదు కదా? ''మీ మిలట్రీ బలగాలు అమాయకులైన పసిపిల్లల్ని చంపుతున్నాయి'' అన్నాడు. ఇజ్రాయెల్ వాడు ఒప్పుకోడు కదా. ''లేదు.. లేదు.. మేం అలా చేయడం లేదు'' – అని ఇంకా ఏదో చెప్పబోయాడు. చైనా స్కాలర్‌కు మండిపోయింది ''ఆపేయ్ అబద్దాలాడడం!'' అని గట్టిగా అరిచాడు. చుట్టుపక్కల వాళ్ళంతా ఏమైందోనని పరిగెత్తుకొచ్చారు. చైనా స్కాలర్ ధైర్యంగా చెప్పాడు. ''ప్రపంచమంతా చూస్తోంది. పాలస్తీనాలో మీరు దెబ్బయి వేలకు పైగా పసిప్రాణాల్ని బలి తీసుకున్నారు. పైగా అబద్దాలా?'' అన్నాడు. చుట్టు మూగిన వారికి విషయం అర్థమైంది. ''యస్! ధైర్యమంటే ఇలాగే ఉండాలి! అబద్దాలాడే వాడు ఎంత బలవంతుడైనా లెక్కచేయకుండా నిజాలు బయటపెడుతూనే ఉండాలి!'' – అని ధైర్యం చెప్పి అభినందించారు. ఇజ్రాయెల్ వాడు తలదించుకుని పక్కకు వెళ్లిపోయాడు.

ఇరాన్‌పై జరిగిన దాడుల్లో మరణించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సుమారు 1.6 కోట్లు మానవతా సహాయం ప్రకటించిన మొదటి దేశం చైనా. యుద్ధం వల్ల నిరాశ్రయుల సంఖ్య పెరిగిందనీ, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అన్ని దేశాలకూ ఉందని చెపుతూ, ఆ దిశలో తాము తొలి అడుగులు వేస్తున్నామని ప్రకటించింది. చైనా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా, ఈ మానవతా సహాయం ఇరానియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి పంపించామని తెలియజేశారు.

(కవిరాజు త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలి గ్రహీత, జీవశాస్త్రవేత్త)

## పాల ఉత్పత్తులలో అగ్రస్థానంలో భారతదేశం!

నేడు పాలు లేదా పాల ఉత్పత్తులు వినియోగించని కుటుంబాలు లేవు. భారత్‌లో పాల వాడకం ఓ వారసత్వ సంపదగా, ఆరోగ్య ప్రదాయినిగా, కుటుంబ సభ్యుల అమృతాహారంగా నేటికీ ప్రముఖ స్థానాన్ని పొందింది. పాలను నేరుగా తాగడం, టీ రూపంలో వాడడం, పెరుగు/మజ్జిగ అన్నంలో భాగం కావడం, పాల నుంచి తయారు చేసిన తీపి పదార్థాలను తినడం, పాలతో తయారైన శీతల పానీయాలు వాడడం, నెయ్యి లేదా వెన్న వినియోగించడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్రం, సుస్థిరాభివృద్ధి, సామాజిక ప్రభావం, డిజిటల్ విప్లవం, ఇన్నొవేషన్, ప్రజారోగ్య విభాగాల ప్రత్యక్ష ప్రభావం పాల ఉత్పత్తుల రంగాలపై పడుతున్నాయి. పాల ఉత్పత్తులు పెరగడంతో భారత్‌లో శ్వేత విప్లవం ఊపందుకుంది. నేడు శ్వేత విప్లవంతో పాటు హరిత, పరిశుభ్రత, భవిష్యత్తుకు అనుకూల అందుగులు పడుతున్నాయి. 1992లో ప్రపంచ పాల ఉత్పత్తి 524 మిలియన్ టన్నులు ఉండగా, 2024లో 979 మిలియన్ టన్నుల వరకు పెరిగింది. కేవలం భారత్‌లోనే 2026లో పాల ఉత్పత్తి 250 మిలియన్ మెట్రిక్ టన్నులుగా నమోదు అవుతూ ప్రపంచంలోనే అత్యధికంగా 25 శాతానికి పైగా పాల ఉత్పత్తి చేసే దేశంగా నిలుస్తున్నది. గత దశాబ్ద కాలంలో భారత్‌లో పాల తలసరి ఉత్పత్తి 48 శాతం పెరగడం గమనించారు. పాలను ఉత్పత్తి చేయడం, డైరీ ఉత్పత్తులను అందుబాటులోకి తేవడం, అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా పేద పిల్లలకు పాలను అందుబాటులోకి తీసుకురావడం నిరంతరం జరగాలి. భారతీయుల భోజనంలో పాల పదార్థాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి.

2026 వివరాల ప్రకారం భారత్‌లో 250 మిలియన్ మెట్రిక్ టన్నులు, యూరోపియన్ యూనియన్‌లో 149.63 మిలియన్ మెట్రిక్ టన్నులు, యూఎస్‌లో 102.66 మిలియన్ మెట్రిక్ టన్నులు, చైనాలో 43.95 మిలియన్ మెట్రిక్ టన్నులు, రష్యాలో 32.50 మిలియన్ మెట్రిక్ టన్నులు, బ్రెజిల్‌లో 27.99 మిలియన్ మెట్రిక్ టన్నులు, న్యూజిలాండ్‌లో 61.32 మిలియన్ మెట్రిక్ టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. పాలలో కాల్షియం (29%), విటమిన్ డి(25%), పొటాషియం, ప్రోటీన్లు(17%), మెగ్నీషియం, సెలీనియం, ఫాస్ఫరస్(23%), విటమిన్ బి12 (15%), రైబోఫ్లావిన్(23%) లాంటి పలు ప్రధాన పోషకాలు ఉంటాయి.

ప్రపంచాన్ని వెంటాడుతున్న కొత్త భయం!

# ది లాస్ట్ జనరేషన్?


నేడు ప్రపంచం ఒక నిశ్శబ్ద 'డెమోగ్రాఫిక్ వింటర్'ను ఎదుర్కొంటోంది. 2026 మే నెలలో అంతర్జాతీయ జనాభా నివేదికల ప్రకారం, అభివృద్ధి చెందిన ప్రపంచంలో సంతానోత్పత్తి రేటు చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయింది. జపాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 2026లో విడుదల చేసిన డేటా ప్రకారం, ఆ దేశంలో జనన రేటు 1.2కి పడిపోగా, 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య మొత్తం జనాభాలో 30%కి చేరింది. అదేవిధంగా, యూరోపియన్ యూనియన్ గణాంక విభాగం మార్చి 2026లో ప్రచురించిన నివేదికలో, ఇటలీ, గ్రీస్ దేశాల్లో మరణాల సంఖ్య జననాల కంటే ఎక్కువగా ఉన్నట్లు ధృవీకరించింది. జనాభా స్థిరీకరణకు అవసరమైన 2.1 సంతానోత్పత్తి రేటును ఏ అభివృద్ధి చెందిన దేశం కూడా అందుకోలేకపోవడం, దీర్ఘకాలిక జనాభా సమతుల్యతపై ఆందోళనలు పెంచుతోంది. ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం 2025 చివర్లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, ప్రపంచ జనాభా 2080 ప్రాంతంలో గరిష్ట స్థాయికి చేరుకున్న తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశముందని పేర్కొంది. ఒకప్పుడు అధిక జనాభానే అతిపెద్ద సవాలుగా భావించిన దేశాలు, ఇప్పుడు జనాభా కొరతతో ఆర్థిక వ్యవస్థలను ఎలా నిలబెట్టుకోవాలనే ఆందోళనలో పడటం గమనార్హం.

**నగదు ప్రోత్సాహకాల మాయాజాలం.. ఎందుకు ఫలితం దక్కడం లేదు?** జనాభా పతనాన్ని అడ్డుకోవడానికి ప్రపంచ దేశాలు కోట్లాది డాలర్లను వెచ్చిస్తున్నా ఫలితాలు మాత్రం శూన్యం. సౌత్ కొరియా పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది; 2006 నుండి 2025 మధ్యకాలంలో ప్రభుత్వం జనాభా పెంపు కోసం దాదాపు 220 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినప్పటికీ, ఏప్రిల్ 2026 నాటికి అక్కడ సంతానోత్పత్తి రేటు 0.96కి పడిపోయింది. సింగపూర్ ప్రభుత్వం కూడా జనవరి 2026లో తన 'బేబీ బోనస్ స్కీమ్'ను సవరించి, నగదు సాయాన్ని పెంచింది. అయితే, జీవన వ్యయం, పనిజీవిత సమతుల్యత లోపించడం వల్ల ఈ ప్రోత్సాహకాలు తాత్కాలిక ఊరటనే ఇస్తున్నాయని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' మే 2026 విశ్లేషణ స్పష్టం చేస్తోంది. చైనా పరిస్థితి కూడా భిన్నంగా లేదు. వరుసగా మూడో ఏడాది అక్కడ జనాభా తగ్గుదల నమోదైంది. ఫ్రాన్స్, స్వీడన్ వంటి దేశాలు నగదు చెల్లింపు, ప్రసూతి సెలవులు, తక్కువ ఖర్చుతో బాలల సంరక్షణ కేంద్రాలు వంటి సమగ్ర విధానాలతో కొంత మెరుగైన పరిస్థితిని కొనసాగిస్తున్నాయి. దీనివల్ల కేవలం నగదు సాయం కంటే, స్థిరమైన సామాజిక భద్రత, సమగ్ర మద్దతు వ్యవస్థలే అత్యంత కీలకమని స్పష్టమవుతోంది.

**జనాభా తగ్గుదల ప్రమాద సంకేతాలు!** జనాభా క్షీణత కేవలం సంఖ్యల సమస్య మాత్రమే కాదు, ఇది ఆర్థిక వ్యవస్థలపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోంది. 'పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా తన 2026 నివేదికలో పేర్కొన్నట్లుగా, వృద్ధుల సంఖ్య పెరిగి, పనిచేసే యువత తగ్గడం వల్ల పెన్షన్ల భారం దేశాల బడ్జెట్‌లను అతలాకుతలం చేస్తోంది. హంగేరి ప్రభుత్వం 2026లో తల్లులకు ఆదాయపు పన్ను నుంచి పూర్తి మినహాయింపునిస్తూ తీసుకొచ్చిన సంస్కరణలు నైతిక చర్చకు దారితీశాయి. ఇప్పటికే జపాన్, జర్మనీ వంటి దేశాలు రోబోటిక్స్, ఆటోమేషన్‌పై భారీగా ఆధారపడుతున్నాయి. తక్కువ జనాభా వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని పర్యావరణవేత్తలు భావించినా, వినియోగ శక్తి తగ్గిపోతే ఆర్థిక చక్రం నెమ్మదిస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**సామాజిక భరోసాయే రేపటి ఆశాకిరణం!**
'ది లాస్ట్ జనరేషన్?' అని మనం ఆందోళన చెందుతున్న తరుణంలో, కేవలం నగదు ప్రోత్సాహకాలు పరిష్కారం కావని చరిత్ర నిరూపిస్తోంది. 2026 మే నాటి తాజా విశ్లేషణల ప్రకారం, జనాభా సమస్యను అధిగమించాలంటే ఆశ్రయించదగిన విద్యా వ్యవస్థ, నాణ్యమైన ఆరోగ్య సదుపాయాలు, యువతకు ఉపాధి భరోసా కల్పించడం అత్యంత కీలకం. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు జనాభా సమతుల్యత కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రపంచ దేశాల వైఫల్యాల నుంచి నేర్చుకున్న గుణపాఠాలను ప్రతిబింబించేలా ఉండాలి. సుస్థిరమైన భవిష్యత్తు కోసం, పారదర్శకమైన విధానాలు, మానవ వనరుల పట్ల గౌరవం ఉన్నప్పుడే ఈ సంక్షోభం నుంచి గట్టెక్కగలం. యువత జీవించడానికి, కుటుంబాలను నిర్మించడానికి అనుకూలమైన సమాజాన్ని సృష్టించడమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత, లేదంటే సామాజిక బంధాలు బలహీనపడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 182 | మంగళవారం | 02-06-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఒఎంఆర్ పద్ధతిలోనే 'నీట్'

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

సిబిటి విధానంలో నిర్వహించాలని దాఖలైన పిటిషన్ స్వీకరణకు నిరాకరణ




**న్యూఢిల్లీ:** నీట్ యుజి – 2026 పరీక్ష నిర్వహణపై సుప్రీం కోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 21న జరగనున్న నీట్ పునఃపరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో నిర్వహించాలని ఆర్‌జెడి ఎంపి సుధాకర్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించింది. ప్రస్తుతం ఉన్న పెన్ అండ్ పేపర్ విధానంలోనే నీట్ పునఃపరీక్ష నిర్వహించాలని జస్టిస్ పిఎస్ నరిసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అకస్మాత్తుగా పరీక్షా విధానాన్ని మార్చడం ఆచరణాత్మకంగా కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. సమయాభావం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)పై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. తర్వాత ఎంపి సుధాకర్ సింగ్ సహా, ఇతరులు దాఖలు చేసిన పలు పిటిషన్లపై తరువాయి 8లో



## నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు అవార్డులు ప్రదానం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వం సోమవారం ఘనంగా నిర్వహించనుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రావతరణ దినోత్సవ ప్రధాన వేడుకల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో పాటు మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ తరువాయి 8లో



# ప్రతి పేదకూ ఇల్లు

- రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తున్నాం
- గూడేలు, లంబాడీ తండాలకు అదనంగా రూ.25 వేల ఇళ్లు మంజూరు
- మరో లక్ష నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది
- తుమ్మిడి హెట్టి నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి : సిఎం రేవంత్‌రెడ్డి
- ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి మండలం కోటారీ గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

ప్రజాపక్షం / కెరిమేరి

'ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు అందించడమే మా లక్ష్యం. రాష్ట్రంలో ఆదివాసీల అభివృద్ధి జరగకపోతే సాధించుకున్న తెలంగాణకు అర్థం లేదు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు జీవనాడిగా భావిస్తున్న తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. అంతర్రాష్ట్ర జలవివాదాల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని కెరిమేరి మండలం కోటారి గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆదివాసీ లబ్ధిదారులకు ఇళ్లను అందజేశారు. జిల్లాలో రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. సిర్పూర్ నియోజకవర్గంలోని చింతలమనేపల్లిలో 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో రూ.18 కోట్ల అభివృద్ధి పనులకు తరువాయి 8లో

## నేడు మూడు ఉద్యోగ నోటిఫికేషన్లు 11

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులందరికీ నాణ్యమైన వైద్య సేవలు

# ఎన్నికలప్పుడే... పొత్తు ధర్మం

- ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాల్సిందే
- వచ్చే రెండేళ్లు ఉద్యమ కాలం
- ప్రజా సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై సమరశీల పోరాటాలకు సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- ఆగస్టు 6నుంచి14వరకు పాదయాత్రలు



ప్రజాపక్షం/ హైదరాబాద్

కాంగ్రెస్‌కు సిపిఐ మిత్రపక్షంగా ఉంది కాబట్టే ఉద్యమాలు చేయలేకపోతున్నామనే భావన ప్రజల్లో ఉందని, ఆ భావనను తొలగించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పొత్తు ధర్మం అనేది ఎన్నికలప్పుడు చూసుకుందామని, కానీ ఇప్పుడు ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. రానున్న రెండేళ్ల కాలాన్ని 'ఉద్యమాల కాలం'గా మార్చుకుని ప్రజా సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై సమరశీల పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సోమవారం సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయ రాములు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్. కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ హాజరై జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను వివరించారు. ఈ సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పొత్తు ఉంటే తరువాయి 8లో

# అమెరికా–ఇరాన్ పరస్పర దాడులు

- మా దాడులు ఆత్మరక్షణకోసమే : సెంట్‌కామ్
- కువైట్‌పై ఇరాన్ డ్రోన్లు,క్షిపణి దాడులు
- పొసగని డిమాండ్ల కారణంగా చర్చల పొడిగింపు : ఇరాన్



**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఈ వారాంతంలో ఇరాన్ మిలిటరీ స్థావరాలపై ఆత్మరక్షణకోసం బాంబు దాడులు చేసినట్లు అమెరికా ప్రకటించగా, దానికి ప్రతిస్పందనగా అమెరికా స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఒకే ఒక్క వారం సమయంలో హోర్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలకు దారితీసిన ఘటనల్లో ఇది మూడవ దాడి. ఇంతకుముందు దాడి చేసినప్పుడు చెప్పిన సాకులనే అమెరికా పునరావృతం చేసింది. ఐతే తమ బలగాలు కూడా అమెరికా స్థావరాలపై దాడులు చేసినట్లు తరువాయి 8లో






## ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో 'జయ' జూనియర్ కళాశాల విజయభేరి



ప్రజాపక్షం/సూర్యాపేట : ప్రతిష్టాత్మక ఐఐటి జెఈఈ అడ్వాన్స్‌డ్ 2026 పరీక్షలో జయ జూనియర్ కళాశాల సూర్యాపేట విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయభేరి మోగించారు. ఆలిండియాలో అన్ని కేటగిరిలలో 155, 278, 298, 490 ర్యాంకులతో పాటు 1000లోపు 7గురు, 5000లోపు 16 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించగా మొత్తం 21 మంది ఐఐటి సీట్లు పొందగలిగే ర్యాంకు సాధించారని జయ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఐఐటి అడ్వాన్స్‌డ్ 2026 జాతీయ స్థాయి క్యాటగిరి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎన్. అవినాష్ 155, డి. రూపశ్రీ 278, జి. లిఖిత 298, జి. మహేష్ 490, ఆర్. మేఘరాజ్ 551, లూసీఫె వెన్సీ 848, బి. భవిత 938, ఎం. రితిన్‌శెట్టి 1005, డి. రామ్‌చరణ్‌తేజ్ 1615, పి. సాత్విక్ కుమార్ 1758, ఎస్.కె. నేహ 2421, ఎన్. హరిని 2538, ఎం.డి. ముస్కాన్ 2691, జి. శ్రీనిక 2941, బి. శాలిని 2946, జి. రంజిత్ కుమార్ 4434, యం. హర్షిత 5987, వి. గౌతమ్ కుమార్ 6421, ఎన్. సిద్దార్థ 7655, జి. లాస్య 7657, సి.హెచ్. శివకుమార్ 9240 ర్యాంకు సాధించినట్లు వివరించారు. ప్రతిభను కనపరిచిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

## వంశీ మహివర్ధన్ గోల్డ్ వర్క్స్ యజమానిపై చీటింగ్ కేసు

### లక్షలు వసూలు చేసి పరార్...గాలిస్తున్న పోలీసులు

ప్రజాపక్షం/హాలియా : పోలీస్ స్టేషన్ పరిధిలో వంశీ మహివర్ధన్ గోల్డ్ వర్క్స్‌పేరుతో బంగారం దుకాణం నిర్వహిస్తున్న తాళ్లపాక బాలకృష్ణాచారిపై చీటింగ్ కేసు నమోదైంది. బంగారం,వెండి వస్తువులను తక్కువ ధరలకు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురి నుంచి లక్షల రూపాయలు తీసుకుని మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.ఫిర్యాదుదారుల వాంగ్మూలాల ప్రకారం,నిందితుడు బంగారం,వెండి వస్తువులను తక్కువ ధరకే అందిస్తానని హామీ ఇచ్చి పెద్ద మొత్తంలో డబ్బులు స్వీకరించాడు. అయితే వస్తువులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ చివరకు దుకాణాన్ని మూసివేసి పరారైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో హాలియా పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్ఐ బి.సాయి ప్రశాంత్ తెలిపారు.ప్రజలు బంగారం,వెండి లేదా ఇతర విలువైన వస్తువుల కొనుగోలు సమయంలో సంబంధిత వ్యక్తులు,సంస్థల విశ్వసనీయతను నిర్ధారించుకుని మాత్రమే లావాదేవీలు నిర్వహించాలని పోలీసులు సూచించారు.అసాధారణంగా తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యండ్లపల్లి గ్రామంలో కందుల మణెమ్మ రామస్వామి, షేక్ శారీఫా ఇంతియాజ్, షేక్ సాబీనా ఇంతియాజ్, మంచికంటి గౌతమి నరేష్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండి రమేష్, జిల్లా నాయకులు మోరిశెట్టి నివేదిత లక్షాది, సర్పంచ్ తాటిపాముల సుధీర్, ఉపసర్పంచ్ ఉయ్యాల ఆదినారాయణ, మార్కెట్ డైరెక్టర్ దాసరి తిరుమలరావు, భూపతి యాదయ్య, పరమేష్ పాల్గొన్నారు.

## సేంద్రియ పద్ధతిలో 20 కిలోల భారీ లక్ష్మణ ఫలం



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : రసాయనాలతో కూడిన ప్రస్తుత రోజుల్లో పూర్తి సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు మండలానికి చెందిన ఓ రైతు. మండలంలోని గాజులమల్కాపురం గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి తన తోటలో పండించిన లక్ష్మణ ఫలం ఇప్పుడు అందరిని ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా లక్ష్మణ ఫలాలు ఒకటి లేదా రెండు కేజీల బరువు మాత్రమే పెరుగుతాయి. కాని అనిల్‌రెడ్డి పండించిన ఈ అరుదైన పండు ఏకంగా 20 కేజీల భారీ బరువుతో అద్భుతంగా ఎదిగింది. ఇది దాదాపు ప్రపంచ రికార్డు స్థాయి బరువుకు చేరువలో ఉందని వ్యవసాయ రంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## పేదలకు భరోసా ఇందిరమ్మ ఇండ్లు

ప్రజాపక్షం/దేవరకొండ: ఇందిరమ్మ ఇండ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శక్రుతండా గ్రామ పంచాయతీలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను నల్గొండ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులు ఉపయోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో పద్మప్రియా, ఎంపిడివో డానియల్, మాజీ జెడ్పిటిసి అరుణ సురేష్‌గౌడ్; వెంకటేశ్వర్లు, వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్ సాయిచంద్రగౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రాంసింగ్, పాండు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### త్వరతగతిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

### మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం /హుజూర్ నగర్ : యావత్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల క్షేమం సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనుక్షణం కృషి చేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల ఆహార శాఖ మాత్యులు నలమాద ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హుజూర్ నగర్ నియోజకవర్గం కేంద్రంలో వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పట్టణ శివారులోని ఫనిగిరి శ్రీ సీతారామచంద్రస్వామి గట్టు వద్ద పేదవారి కోసం నిర్మిస్తున్న 2160 జి ప్లస్ వన్ ఇందిరా మోడల్ కాలనీ సముదాయాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుజూర్ నగర్ పట్టణంలో సొంత ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇల్లు అందించడమే లక్ష్యంగా కోట్లాది రూపాయలతో ఇందిరా మోడల్ కాలనీని నిర్మించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. హుజూర్ నగర్ పట్టణంలో రూ. 50 లక్షలతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కంట్రోల్ రూమ్‌ను హుజూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్, ఎస్పీ కె. నరసింహ, ఆర్డీవో శ్రీనివాసులు, డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ చరమంద రాజు, తాసిల్దార్ బండ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జల్ సంచయ్ జన్ భాగీదారీలో రాష్ట్రంలో

# నల్లగొండకు రెండోస్థానం

### అభినందించిన కలెక్టర్ బి.చంద్రశేఖర్




ప్రజాపక్షం/నల్లగొండ: జల్ సంచయ్ జన్ భాగీదారీ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను అభినందించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు జల్ సంచయ్ జన్ భాగీదారీ కార్యక్రమం కింద జిల్లాలో 1.50లక్ష పనులు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించగా 1.29లక్ష పనులను పూర్తి చేసి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచామని తెలిపారు.ఇందుకు కృషి చేసిన జిల్లా అధికారులందరూ టీమ్‌వర్క్ చేసి జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని కోరారు.అలాగే ఈనెల 1 నుంచి 5 వరకు స్వచ్ఛ గావ్ సురక్షిత్ జల్ వాయు కార్యక్రమాన్ని చేపట్టామని,ఈ కార్యక్రమ విజయవంతానికి జిల్లా అధికారులందరూ సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి నూతనంగా ప్రవేశపెట్టనున్న ఆరోగ్య కార్డులు, సర్వీస్ రిజిస్టర్ల ఆన్‌లైన్ అప్‌డేషన్‌కు సంబంధించి అన్ని శాఖల అధికారులు తక్షణమే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,జెడ్పీసీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డిఎఫ్ఓ ఎస్.రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

# 30 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్



సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ్మా

ప్రజాపక్షం/సూర్యాపేట : జూన్ ఒకటి నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పి కె. నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డిఎస్‌పి లేదా ఆపై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని, సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తుల, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారితీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డిజెలు వంటి వాటికి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్టప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ అక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

**బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు : ఎస్‌పి**

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బాధితులకు న్యాయం జరిగేలా చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి కె. నరసింహ హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా బాధితుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను విని వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని గుర్తించాలన్నారు. భూతగాదాలు, కక్షలకు పోయి దాడులు, దౌర్జన్యాలు చేస్తే ఎంతటి వారైనా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సందడి!

### మునుగోడు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘన సత్కారం

ప్రజాపక్షం/యాదాద్రి : మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు మునుగోడు క్యాంప్ కార్యాలయంలో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు నాయకులు కలిసి కేక్ కట్ చేసి, అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేసే అరుదైన నాయకుడని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రథమ ప్రాధాన్యతనిస్తారని పేర్కొన్నారు. భగవంతుడు రాజగోపాల్ రెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఆయన దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. క్యాంప్ కార్యాలయానికి పోటెత్తిన అభిమాన జనం ప్రజా నాయకుడి పుట్టినరోజును పురస్కరించుకుని మునుగోడు నియోజకవర్గ నలుమూలల నుండి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చారు. రాజగోపాల్ రెడ్డికి శాలువాలు, గజమాలలతో ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రజావాణిలో 103 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఏఓ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఇఓ అశోక్, డిసిఓ ప్రవీణ్, డివైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సి సంక్షేమ అధికారి దయానందరాణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై లింగయ్య సేవలు ఎప్పటికీ మరువలేనివి




ప్రజాపక్షం/మోటకొండూరు : ప్రజాసమస్యల పరిష్కారంలో గట్టికోప్పుల లింగయ్య చేసిన సేవలు మరువలేనివని ఆయన అడుగు జాడలో యువత ముందుండి పోరాడాలని మోటకొండూర్ మండల సిపిఐ కార్యదర్శి గాదేగాని మానిక్యం అన్నారు. ఆయన సోమవారం మండలంలోని వర్టూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గట్టి కొప్పుల లింగయ్య 5వ వర్థంతి సందర్భంగా స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానిక్యం మాట్లాడుతూ సీనియర్ నాయకులు గట్టి కొప్పుల లింగయ్య, బడుగు బలహీన వర్గాల నిరుపేద కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా వెన్నంటూ ఉండి, 1946/1951 సంవత్సర మధ్య కాలంలో తన18 సంవత్సరాల వయస్సులోనే భారత కమ్యూ నిస్టు పార్టీలో సభ్యత్వం పొంది పార్టీ సిద్ధాంతాలతో గ్రామ స్థాయిలో రైతు సభలను నిర్వహించి రైతులందరినీ సంఘటితం చేసి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, భూస్వాముల పెత్తందారులకు వ్యతిరేకంగా అహర్నిశలు పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ సెక్రెటరీ సూదగాని వెంకన్న, గట్టి కుప్పుల సరిత మచ్చేందర్, సిపిఐ మోటకొండూరు మండల సహాయ కార్యదర్శి ముసుకు పెంటారెడ్డి,మండల పార్టీ కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, పశువుల నరసింహ, సుదర్శన్, పల్లె శ్రీనివాస్, కర్రే సిద్దులు, నల్ల రాములు, గువ్వ వెంకన్న, పువ్వా కమలమ్మ, ఉప సర్పంచ్ మోర శ్రీనివాసరెడ్డి, నోముల మహేందర్ రెడ్డి, కొప్పుల గట్టి కొప్పుల లక్ష్మి నారాయణ, గట్టి కొప్పుల అమరేందర్, గట్టికొప్పుల శ్రీనివాస్, గట్టికొప్పుల మల్లయ్య, కుటుంబ సభ్యులు పువ్వ సిద్దులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# 'బడుగు జనుల ఊపిరి' పుస్తకావిష్కరణ

### ప్రముఖుల ప్రశంసలు



ప్రజాపక్షం/నకిరేకల్ : ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదినాన్నిపురస్కరించుకొని ఆయన ప్రజా జీవితం,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను ప్రతిబింబించే వేముల వీరేశం మిత్రబృందం ఆధ్వర్యంలో ముద్రించిన‌బడుగు జనుల ఊపిరి పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని నిధి కన్వెన్షన్ హాల్‌లో ఆవిష్కరించారు.ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా వేముల వీరేశం ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు.బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.ప్రజా ప్రతినిధిగా,సామాజిక సేవకుడిగా ఆయన సాగించిన సేవా ప్రస్థానాన్ని భావితరాలకు చేరవేసే ప్రయత్నమే బడుగు జనుల ఊపిరిపుస్తకమని అభిప్రాయపడ్డారు.పుస్తకావిష్కరణ ఈకార్యక్రమంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి,ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫసర్ కాశీం, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య,బత్తుల లక్ష్మారెడ్డి,కుంభం అనిల్‌కుమార్ రెడ్డి,మల్‌రెడ్డి రంగారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మదర్ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి,మువ్వ విజయ్ బాబు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత,కవులు,రచయితలు బెల్లి యాద య్య,నర్రా ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్, నల్లగొండ గద్దర్,పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, పూజర్ల శంబయ్య, గుత్తా మంజుల మాధవరెడ్డి,నర్రా వినోద్ మోహన్‌రెడ్డి, రజితశ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాపిడో,ఓలా వంటి బైక్ టాక్సీలను నిలిపివేయాలి

### ఆటో కార్మికుల డిమాండ్

### కనీస ఛార్జీ రూ.30గా నిర్ణయించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :మా పొట్ట కొట్టొద్దు సార్,మా కుటుంబాలను రోడ్డున పడేయొద్దు అంటూ నల్లగొండ పట్టణ ఆటో కార్మికులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండలో దాదాపు 5వేల మంది ఆటో డ్రైవర్లు తమ కుటుంబాల జీవనోపాధి కోసం ఆటోలపై ఆధారపడుతున్నారని,ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో ఇప్పటికే ఆదాయం భారీగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే సమయంలో ర్యాపిడో, ఓలా వంటి బైక్ టాక్సీ యాప్‌ల కారణంగా ఆటోలకు వచ్చే ప్రయాణికులు మరింత తగ్గిపోయారని తెలిపారు. రోజంతా తిరిగినా డీజిల్,గ్యాస్ ఖర్చులు కూడా రావడం లేదని, ఇంటికి వెళ్లి పిల్లల ముఖాలు చూడలేని పరిస్థితి వచ్చిందని వాపోయారు.పెరిగిన ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు,కుటుంబ భారం నేపథ్యంలో స్థానిక కనీస ఆటో ఛార్జీని రూ.30గా నిర్ణయించి,దానికి అధికారిక అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.ఆటో నడిపితే కుటుంబం గడవడం లేదు.బైక్ టాక్సీలు ఆగకపోతే ఆటో కార్మికుల బతుకులు అగమ్యగోచరమే అంటూ ఆవేదన వ్యక్తం చేశా రు. ప్రభుత్వం వెంటనే స్పందించి బైక్ టాక్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ముమ్మరంగా నాలా పూడికతీత పనులు

### జిహెచ్‌ఎంసి పరిధిలో..
### రూ.43.30 కోట్లతో
### 241 పూడికతీత పనులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలో భారీ స్థాయిలో మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టింది. 2026 సంవత్సరానికి సంబంధించి మొత్తం 241 పూడికతీత పనులు రూ. 43.30 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేయగా, వాటిలో 240 పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నట్లు జిహెచ్‌ఎంసి అధికారులు వెల్లడించారు. జోన్‌ల వారీగా పరిశీలిస్తే, రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 60 పనులు రూ.11.86 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయి. గోల్కొండ జోన్‌లో 57 పనులకు రూ.9.60 కోట్లు కేటాయించగా, వాటిలో 56 పనులు రూ.9.47 కోట్లతో పురోగతిలో ఉన్నాయి. ఒక పని రూ.13.50 లక్షల అంచనా వ్యయంతో రీకాల్ టెండర్ ప్రక్రియలో ఉంది. శంషాబాద్ జోన్‌లో 17 పనులు రూ.5.74 కోట్లతో, చార్మినార్ జోన్‌లో 37 పనులు రూ.6.25 కోట్లతో, ఖైరతాబాద్ జోన్‌లో 32 పనులు రూ.5.77 కోట్లతో, సికింద్రాబాద్ జోన్‌లో 38 పనులు రూ.4.05 కోట్లతో అమలవుతున్నాయి. మొత్తం 241 పనులకు రూ.43.30 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం 240 పనులు రూ.43.16 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయి. మిగిలిన ఒక పని టెండర్ ప్రక్రియలో ఉందని అధికారులు తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.

## చెత్త డంపింగ్‌యార్డుపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** పర్యావరణానికి ముప్పు కలిగించే చెత్త డంపింగ్ యార్డును ఎలా ఏర్పాటు చేసారని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామం నుండి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు చేపట్టిన యాత్రకు మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి మద్దతు తెలిపారు. సిద్దాపూర్ గ్రామం నుండి నిర్వహించిన పాదయాత్రకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతిపాధిన చెత్త డంపింగ్ యార్డు వల్ల స్థానిక ప్రజల్లో పర్యావరణ, ఆరోగ్య సంబంధింత ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంకాయ నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, రాంబల్‌నాయక్, ఈట గణేష్, ఎమ్మె సత్యనారాయణ, మన్నె కవిత నారాయణ, శ్రీలత, నరేందర్, లావణ్య దేవేందర్ యాదవ్, మెండే కృష్ణ, పద్మారెడ్డి, మురళీధర్‌రెడ్డి, కోస్గి శ్రీనివాస్, హఫీజ్, లక్ష్మణ్‌నాయక్, తులసమ్మ, బాలయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

### ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎల్‌బి నగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినాపురం డివిజన్ హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ ఫేజ్2, ద్వారా తిరుమల కాలనీ వాసుల కోరిక మేరకు కాలనీల్లో పర్యటించారు. కాలనీ వాసుల నుంచి అనేక సమస్యలు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి. కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


## రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** నాళాలు, కాలువలు అక్రమంగా కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆర్‌డిఓకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కావలి సురేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ సమీపంలో బై పాస్ రోడ్డు ప్రక్కన నవ భూమి రియల్ ఏస్టేట్ దారులు బొంతపల్లి కుంట చెందిన కాలువలు, నాళాలు, నక్షా రోడ్లను అక్రమంగా కబ్జా చేసిన బడా రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ దారులపై సమగ్ర విచారణ జరిపి అక్రమ లే అవుట్లలోని నిర్మాణ పనులను ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు పి.నీలమ్మ తదివతరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలు

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** రైతు సమస్యల పరిష్కారం కోసం సంఘటిత శక్తిగా ఏర్పాటు అయ్యేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని కోనాయపల్లి, సంతాపూర్, కొత్తపేట, కేశంపేట, బోదునంపల్లి గ్రామాల్లో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతం మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులందరు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అన్నదాతలు సంఘటితంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు నాయకులు జె.అంజయ్య, బి.రామ్‌చందర్, కె.నరేందర్, బి.ఎల్లేష్, జి.వేణులతోపాటు రైతులు పాల్గొన్నారు.

## రైతులు పంట అవశేషాలు కాల్చొద్దు

### మండల వ్యవసాయధికారి అర్ రవినాథ్

**ప్రజాపక్షం/యాచారం :** రైతులు నేల అరోగ్యంపై పంటల వ్యర్థాలను కాల్చడం సరైందికాదని మండల వ్యవసాయధికారి అర్.రవినాథ్ అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కల్గించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్క జొన్న, గడ్డి వంటి అవశేషాలను తగుల బెట్టడం సరైందికాదన్నారు. అలా కాల్చడం వల్ల సేంద్రియ కార్బన్ నషిస్తుందన్నారు. నేల సారవంతం, నీటి నిలుపుదల మంచి నేల నిర్మాణం సూక్ష్మ జీవుల కార్యకాలాపాలు ఫలితం క్షీణతకు గురవుతుందన్నారు. వానపాములు ఉపయోగం ఎంతగానో ఉంటుందన్నారు. కాల్చడం వల్ల అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడి బ్యాక్టిరియను చంపుతాయన్నారు. పోషకాల నష్టం జరుగుతుందన్నారు. నీరు భూమిలోకి ఇంకి పోవడం తగ్గుతుందన్నారు. తేమ నిలుపుదల తగ్గడం పంట అవశేషాలు తేమను నిల్వ చేస్తాయన్నారు. పంటల వ్యర్థాలను కంపోస్టు ఎరువుగా మార్చుకోవాలన్నారు. పంట అవశేషాల నిర్వహణ పద్ధతులను పాటించడం వల్ల నేల అరోగ్యం పంట ఉత్పాదక కత పర్యావరణ నాణ్యత పెరుగుతుందన్నారు. పంట అవశేషాలను కాల్చడం చట్ట పరంగా నేరమని తెలిపారు.

## జనగణ తొలి దశ ఇంటి జాబితా, గృహ ప్రక్రియను వేగవంతం చేయాలి

### కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణ–2027 కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న తొలి దశ ఇంటి జాబితా (హౌస్ లిస్టింగ్), గృహ గణన (హౌసింగ్ సెన్సస్) ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జనగణన కార్యక్రమ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో జరుగుతున్న గృహ గణన పనులపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది వంటిది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రతి గృహాన్ని సందర్శించి, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని,ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం పూర్తిస్థాయిలో సేకరించడంతో పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా అత్యంత జాగ్రత్తతో విధులు నిర్వహించాలి" అని సూచించారు. అలాగే, "గణన ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యత నిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గృహ గణన ప్రక్రియను మరింత వేగవంతం చేసి, వందకు వంద శాతం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సమీకృత రంగారెడ్డి జిల్లా కార్యాలయాల సముదాయం, కొంగరకలాన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ సి.నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు."తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఈ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఏర్పాటును ముందుగానే పరిశీలించి పూర్తిచేయాలని కోరారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

## సమర్థవంతంగా రైతుసంక్షేమ పథకాల అమలు



### జిల్లా వ్యవసాయ అధికారి శైలజ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లా వ్యవసాయ అధికారి(డిఎఒ)గా ఎస్.శైలజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు జిల్లా వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన డి.ఉష మే 31, 2026న ప్రభుత్వ సేవల నుండి పదవీ విరమణ పొందిన నేపథ్యంలో ఆమె స్థానంలో శైలజ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్.శైలజ మాట్లాడుతూ రైతు సంక్షేమం వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, రైతులకు సకాలంలో సాంకేతిక సూచనలు, నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సుస్థిర వ్యవసాయ విధానాల ప్రోత్సాహం, పంటల వైవిధ్యీకరణ, రైతులకు నాణ్యమైన సేవలందించడం తన ప్రధాన లక్ష్యాలని ఆమె వెల్లడించారు. జిల్లాలోని రైతులు వ్యవసాయ శాఖ అందించే సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన మాజీ జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష సేవలను వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కొనియాడారు. జిల్లా వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ఆమె చేసిన విశేష కృషిని గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, నూతన జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శైలజకు శాఖ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి, జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

## పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే

### జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, సివిల్ సప్లయ్ మేనేజర్ హరీష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సేవా భావానికి కాదని రంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వనజాత, సివిల్ సప్లయ్ మేనేజర్ జె.హరీష్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ముప్పిడి భారతిని సివిల్ సప్లై అధికారులు వనజాత, హరీష్, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి ఘనంగా ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయితీ,అంకితభావంతో తన విధులను నిర్వర్తించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చిన సిబ్బంది సేవలు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని, ఆ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో కీలకమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముప్పిడి భారతి కుటుంబ సభ్యులు, సివిల్ సప్లై కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్–2026లో

## తిరుగులేని శక్తి 'శ్రీచైతన్య'



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన జెఇఇ అడ్వాన్స్‌డ్–2026 పరీక్షలో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తమ అపూర్వ ప్రతిభను చాటుకున్నాయి. సోమవారం విడుదలైన జెఇఇ అడ్వాన్స్–2026 ఫలితాల్లో సౌతిండియా నెం.1 శ్రీచైతన్యయే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 4వ ర్యాంక్ మోహిత్ స్ హాల్ టికెట్ నెంబర్ 266152016, తెలంగాణ బెస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థిదే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 9 వ ర్యాంక్ ఎం.నాగ సహర్ష హాల్ టికెట్ నెంబర్ 266145246, ఆంధ్రప్రదేశ్ బెస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య విద్యార్థిదే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10 వ ర్యాంక్ దర్శ్ శిక్క హాల్ టికెట్ నెంబర్ 262105093 (డి ఎల్ పి)తో పాటు టాప్ 10 లోపు 3 ర్యాంకులు, టాప్ 100లోపు 4,9,10,17,21,26,28,30,31,36, 37,38,40,41,44,45,52,56,59,62,64,66, 67,72,73,74,79, 81, 87, 91, 92, 93, 95, 98, 99 ర్యాంకులతో టాప్ 100లో 35కు పైగా ర్యాంకులు, అలాగే టాప్ 1000లో 196కు పైగా ర్యాంకులు సాధించి తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించారు. ఇదే విజయ పరంపరను కొనసాగిస్తూ, జెఇఇ మెయిన్ 2026లో కూడా శ్రీచైతన్య విద్యార్థులు 300/300 పరిపూర్ణ మార్కులతో రెండు ఆలిండియా మొదటి ర్యాంకులను సాధించారు. అదేవిధంగా టాప్ 100లో 27 ర్యాంకులు, టాప్ 1000లో 166 ర్యాంకులు సాధించి అసాధారణ ప్రతిభను కనబరిచారు. ఈ అద్భుత విజయాల సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకాడెమిక్ డైరెక్టర్ అండ్ సిఇఒ సుష్మ బొప్పన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "శ్రీచైతన్యలో అమలు చేస్తున్న వినూత్నమైన పరిశోధనాధారిత శాఖ విద్యా కార్యక్రమాలు, అత్యున్నత స్థాయి అకాడెమిక్ ప్రణాళికలు, విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, పరిపాలనా బృందం సమిష్టి కృషి ఫలితంగానే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయన్నారు. జెఇఇ మెయిన్, జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో వరుసగా సాధిస్తున్న ఈ అసాధారణ ఫలితాలు మా విద్యా విధానాల ప్రభావాన్ని, నాణ్యతను, నిరంతర శ్రేష్ఠత సాధనను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఐఐటి మద్రాస్ జోన్‌లో టాప్ 500 లోపు 50 శాతం పైగా ర్యాంకులు శ్రీ చైతన్యనే కైవశం చేసుకుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల రంగంలో శ్రీచైతన్య మరోసారి తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అత్యుత్తమ ఫలితాలతో విజయపథంలో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు.

### జెఇఇ అడ్వాన్స్‌డ్–2026 ఫలితాల్లో ఆలిండియా టాప్ 20లో

## 6 ర్యాంకులతో 'నారాయణ' ప్రభంజనం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సోమవారం ప్రకటించిన జెఇఇ అడ్వాన్స్‌డ్–2026 ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తాచాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో కుచి సందీప్ (హెచ్.నెం: 266121063) 5వ ర్యాంక్, మను పరమేశ్వరన్ (హెచ్.నెం: 261049023) 13వ ర్యాంకు, ప్రిన్స్ చౌదరి (హెచ్.నెం: 262092058) 14వ ర్యాంక్, వెల్దుర్తి హర్షిత్ (హెచ్.నెం: 266053091) 15వ ర్యాంక్,తనయ్ అగర్వాల్ (హెచ్.నెం: 262078257) 16వ ర్యాంకు, అనీష్ ముప్పాల (హెచ్.నెం: 266131526) 20వ ర్యాంక్‌తో టాప్ 20 ర్యాంకుల్లో 6 ర్యాంకులు నారాయణ కైవశం చేసుకుంది. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 22, 23, 24, 27, 35, 39, 41, 44, 51, 54,57, 58, 60, 61, 63, 71, 72, 75, 78, 79, 80, 83, 84, 89, 98, 99, 100 వంటి టాప్ 100 లోపు 35 ర్యాంకులు, 500 లోపు 133 ర్యాంకులు,1000 లోపు 217 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డా.పి.సింధూర నారాయణ, పి..శరణినారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 2,4,5,6,6,7,9 వంటి 10లోపు 16 ర్యాంకులు, 50 లోపు 69 ర్యాంకులు, 100 లోపు 147, 500 లోపు 540, 100 లోపు 894 ర్యాంకులను కైవసం చేసుకుని ఐఐటి ఆశయాలను సాకారం చేయటంలో వేరెవ్వరూ నారాయణకు సాటిలేరని, సాటిరారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 190000 మందికి పైగా విద్యార్థులు పోటీపడిన ఈ పరీక్షా ఫలితాలలో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.పి. సింధూర నారాయణ మాట్లాడుతూ ఈ అద్భుతమైన విజయానికి కుచి సందీప్ నాయకత్వం వహించాడని పేర్కొన్నారు. కుచి సందీప్ ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా 5 వ ర్యాంక్ సాధించాడని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సందీప్, నారాయణ స్కూల్‌లో తరగతి మరియు నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివినట్లు చెప్పారు. అతను ఒలింపియాడ్ స్వర్ణ పతక విజేత అని తెలిపారు. అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్ 2025లో స్వర్ణ పతకం గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచాడన్నారు. ఉజ్బెకిస్తాన్‌లో జరగనున్న అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్ 2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి మరోసారి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నారాయణలో అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌లు, మైక్రోషెడ్యూల్, బెస్ట్ స్టడీమెటీరియల్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, టాప్ ఫ్యాకల్టీ తోనే ఇంతటి ఘనవిజయానికి కారణాలని తెలిపారు. 8 వ తరగతి నుండే జెఇఇకి అవసరమైన శిక్షణ అందించటంతోపాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ఎలాంటి క్లిష్టమైన ప్రశ్నలు వచ్చిన తక్కువ సమయంలో సరైన సమాధానం గుర్తించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ ఎన్‌లెర్న్ యాప్ ద్వారా ఛాప్టర్ వైజ్ ప్రాక్టీస్ టెస్టు మరియు ఆన్‌లైన్ మాక్ టెస్టు నిర్వహించటంతోనే నారాయణ విద్యార్థులు ఇంతటి ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలిగారని తెలిపారు. ఈ విధానాల వల్లే తెలుగు రాష్ట్రాల నుండి అత్యధిక విద్యార్థులు, జాతీయస్థాయిలో నారాయణ నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఐఐటిల్లోకి ప్రవేశిస్తున్నట్లు పేర్కొన్నారు. టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్లో చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందనలు తెలిపారు.

## రెండు రోజుల్లో కేరళకు 'నైరుతి'



**న్యూఢిల్లీ :** రెండు మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశి స్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సాధారణంగా ఈ రుతు పవనాల కాలం జూన్ 1వ తేదీన ప్రారంభమవుతుంది. 'రాబోయే రెండు మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు నైరుతి, ఆగ్నేయ అరేబియా సము ద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి' అని వాతావరణ శాఖ తెలిపింది. ఈ కాలంలో నైరుతి, పశ్చిమ మధ్య, తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన ప్రాంతాల్లోకి కూడా ఈ విస్తరణ జర గవచ్చని అది అంచనా వేసింది. మే 26న కేరళలో రుతుపవనాల ప్రవేశం జరుగుతుందని ఐఎండి గతంలో అంచనా వేసింది. అయితే, రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో, అది వచ్చే వారంలో జరగవచ్చని మే 29న ఆ శాఖ పేర్కొంది. గత వారం తన సవరించిన అంచనాలో, ఈ సీజన్‌లో వర్ష పాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఆ శాఖ తెలిపింది. ఈ సంవత్సరం భారతదేశం తన దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ)లో 90 శాతం వర్ష పాతాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఎల్‌పిఎ అంటే ఒక నిర్దిష్ట ప్రాంతంలో, ఒక నెల లేదా రుతువు వంటి నిర్దిష్ట వ్యవధిలో నమో దైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుండి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలా నికి సగటున లెక్కించడం. 1971 నుండి 2020 వరకు ఉన్న డేటా ఆధా రంగా, భారతదేశం మొత్తంలో రుతుపవన వర్షపాతం యొక్క ఎల్‌పిఎ 87 సెంటీమీటర్లుగా ఉంది. ఒక రుతుపవన కాలంలో ఎల్‌పిఎ వర్షపాతంలో 90 శాతం కంటే తక్కువ నమోదైతే, ఐఎండి దానిని 'లోటు'గా వర్గీకరి స్తుంది. ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతానికి ఒక కారణం ఎల్ నినో పరిస్థితుల ఆవిర్భావం కావచ్చు, ఇది భారతదేశంలో రుతుపవనాల సమయంలో తక్కువ వర్షపాతానికి దారితీస్తుందని ఐఎండి తెలిపింది. ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో తటస్థ ఎల్ నినో-సద రన్ ఆసిలేషన్ పరిస్థితులు ఎల్ నినో పరిస్థితులుగా మారుతున్నాయని అది పేర్కొంది. జూన్‌లో ఎల్ నినో పరిస్థితులు బలహీనంగా, సెప్టెంబర్‌లో మధ్యస్థం నుండి బలంగా ఉండే అవకాశం ఉందని ఐఎండి వెల్లడించింది.

# జేబు దొంగలపట్ల జాగ్రత్త

- వారు సిబిఎస్ఇలోనే తిష్ట వేశారు
- విద్య సేవగా కాకుండా వ్యాపారంగా చూస్తే తప్పులు సరిదిద్దబడకపోగా, రెట్టింపు అవుతాయి
- 12వ తరగతి పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో చేసిన తప్పుల కారణంగా సిబిఎస్ఇ లాభపడుతోంది : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** విద్యాశాఖ పని తీరు, అవకతవకలకు సంబంధించి లోక్‌స భలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కేంద్ర సర్కార్‌పై విమర్శల పర్వం కొనసాగిస్తు న్నారు. తాజాగా సిబిఎ స్ఇ పునర్మూల్యాంకన ప్రక్రియ, దాని ఖర్చుపై సోమ వారం మోదీ ప్రభుత్వంపై విమ ర్శలు గుప్పించారు. విద్యను ఒక సేవగా కాకుండా వ్యాపారంగా చూసినప్పుడు, తప్పులు సరిదిద్దబడకపోగా, రెట్టింపు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డు ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) విధానం వల్ల ఇబ్బందులు ఎదుర్కొం టున్న సిబిఎస్ఇ విద్యార్థులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను రాహుల్ షేర్ చేశారు. 'దొంగల పట్ల జాగ్రత్త వహిం చండి. ఈ రోజు వారు సిబిఎస్ఇలోనే కొలువుదీరారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మీ మార్కులు తప్పుగా వస్తే, మీకు ఏమి లభిస్తుంది? ఒక బిల్లు: డిజిటల్ స్కాన్ చేసిన కాపీ: ఒక్కో సబ్జెక్టుకు రూ. 100. రీటోటలింగ్: ఒక్కో పేపర్‌కు రూ. 100. పునర్మూల్యాంకనం: ఒక్కో ప్రశ్నకు రూ. 25' అని రాహుల్‌గాంధీ ఆ వీడియో క్లిప్‌తో పాటు 'ఎక్స్' ప్లాట్ ఫామ్‌లో హిందీలో పెట్టిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒక విద్యార్థి తన సొంత జవాబు పత్రం సరైన మూల్యాంకనం కోసం రూ. 2,000 వరకు చెల్లించాల్సి రావచ్చని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 4 లక్షల మంది విద్యా ర్థులు ఇలాంటి దరఖాస్తులు సమర్పించిన ప్పుడు సిబిఎ స్ఇ ఎంత ఆదా యాన్ని ఆర్జి స్తుందో ఒక్కసారి ఊహించుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లతో స్కాన్ చేసినప్పుడు, తప్పుడు మార్కింగ్ జరగడం అనివార్యమన్నారు. ఆ తప్పులను సరిదిద్దే ఖర్చును విద్యా ర్థులే భరిస్తున్నారని చెప్పారు. తప్పు సిబి ఎస్ఇది అయితే, శిక్ష విద్యార్థికి పడు తుందని, లాభం ప్రభుత్వానికి వెళ్తుం దని మాజీ కాంగ్రెస్ అధినేత అన్నారు. విద్యను ఒక సేవగా కాకుండా వ్యాపా రంగా చూసినప్పుడు, తప్పులు సరిదిద్ద బడక రెట్టింపు అవుతాయని, దీనికి భారీ మూల్యం మన పిల్లలే చెల్లిస్తున్నారని ఆవేదన చెందారు. 12వ తరగతి విద్యార్థి వేదాంత్, పునర్మూల్యాంకన ప్రక్రియలో భాగంగా సిబిఎస్ఇ అప్ లోడ్ చేసిన ఫిజిక్స్ జవాబు పత్రం తనది కాదని ఇటీవల ఎక్స్‌లో ఆరోపించాడు. అది వైరల్ అయిన తర్వాత, పలువురు ఇతర విద్యార్థులు కూడా ఇలాంటి ఆరో పణలతో సోషల్ మీడియాను ఆశ్రయిం చారు. ఆ వీడియోలో రాహుల్ గాంధీ వేదాంత్, అతని సోదరుడు, ఇతర విద్యార్థులతో వారి కష్టాల గురించి అన ధికారికంగా మాట్లాడుతుండగా కనిపి స్తుంది. వీడియో క్లిప్‌లో, రాహుల్‌గాంధీ విద్యార్థులను పునఃమూల్యాంకనానికి అయ్యే ఖర్చు, ఆ ప్రక్రియ పద్ధతుల గురించి అడుగుతూ కనిపించారు.

**రాజధర్మాన్ని పాటించి మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలి: జైరాం రమేశ్**

సిబిఎస్ఇ ఒఎస్ఎం వివాదంపై మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఎంపి జైరాం రమేశ్ విరుచుకుపడ్డారు. ప్రధాన మంత్రి మోదీ తన సహచరులను ఎన్నడూ నిజా యితీ, నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా చూడలేదని ఆరోపించారు. అయితే అసమర్థతకు నిదర్శనమైన మంత్రి ప్రధాన్ రాజధర్మాన్ని పాటించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తమ ఆన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థలోని సైబర్ సెక్యూరిటీ లోపాలను కొన్ని వారాల తర్వాత సిబిఎస్ఇ అంగీకరించింది. అయితే సిబిఎస్ఇ కాంట్రాక్టర్ అయిన కోఎప్ట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోబో తోందనేదే పెద్ద ప్రశ్న. 2025 ఆగస్టు నాటి తన ఆర్ఎఫ్‌పిలో సమర్థవంతంగా పని చేయలేని వెండర్లను బ్లాక్‌లిస్ట్ చేసే అధికారాన్ని సిబిఎస్ఇ తన వద్దే ఉంచు కుంది. గతేడాది సెప్టెంబర్‌లో ఈ వెండ ర్లను బ్లాక్‌లిస్ట్ చేసే తన అధికారాన్ని తానే తొలగించుకుంటూ సిబిఎస్ఇ ఒక సవరణను జారీ చేసింది. ఇది కోఎ ప్ట్‌ను కాపాడటానికి ప్రభుత్వం ఇచ్చే మద్దతును సూచిస్తోంది. లక్షలాది విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీ సిన మంత్రి ప్రధాన్‌ను దేశం ఇంకెంత కాలం భరించాల్సి ఉంటుంది?' అని జైరాం రమేశ్ తెలిపారు.

## జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

- ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్‌కు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్
- 360 మార్కులకు గాను 330 మార్కులు
- జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు మొత్తం 56,880 మంది అభ్యర్థులు అర్హత

**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటిల్లో బిటెక్ ప్రవేశాలకు నిర్వహించిన జెఇఇ అడ్వా న్స్‌డ్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్, 360 మార్కు లకు గాను 330 మార్కులు సాధించి అగ్రస్థా నంలో నిలిచినట్లు అధికారులు సోమ వారం ప్రకటిం చారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీ క్షకు మొత్తం 56,880 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అర్హత సాధించిన మొత్తం అభ్యర్థులలో



10,107 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. అలాగే మొత్తం 46,773 మంది పురుష అభ్య ర్థులు ఉన్నారు. ఈ పరీక్షకు హాజరైన ఒక థర్డ్ జెండర్ అభ్యర్థి అర్హత సాధించలేకపోయారు. ఈ పరీక్షకు 3,052 మంది దివ్యాంగ (పిడబ్ల్యుడి) అభ్యర్థులు కూడా నమోదు చేసుకున్నారు. వీరిలో 2,864 మంది రెండు పేపర్లకూ హాజరు కాగా, 887 మంది అర్హత సాధించారు. ఐఐటి ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్, 360 మార్కులకు గాను 330 మార్కులు సాధించి మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఐఐటి ఢిల్లీ జోన్‌కే చెందిన ఆరోహి దేశ్‌పాండే ఆల్ ఇండియా 77వ ర్యాంక్ సాధించి మహిళా అభ్యర్థులలో అగ్రస్థానంలో నిలిచారు. 360 మార్కులకు గాను 280 మార్కులు సాధించారు. కబీర్ చిల్లర్ 329 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలవగా, జతిన్ చాహార్ 319 మార్కు లతో మూడవ ర్యాంకును కైవసం చేసుకున్నారు. మొదటి ర్యాంకు సాధించినందుకు తాను ఎంతో సంతోషంగా ఉన్నానని శుభమ్ కుమార్ తెలి పారు. గత రెండేళ్లుగా తాను జెఇఇ అడ్వాన్స్‌డ్ కోసం సన్నద్ధమవుతున్నాని, తన కఠోర శ్రమ మంచి ర్యాంకు సాధించిపెడుతుందని ఆశించానని చెప్పారు. ఇప్పుడు తాను ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించడంతో చాలా సంతోషంగా ఉందని పిటిఐకి చెప్పారు. కాగా, ఇండియన్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నా లజీ రూర్కీ విడుదల చేసిన ఫలితాల గణాంకాల ప్రకారం... మే 17న నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ 2026 పరీక్షకు నమోదు చేసుకున్న మొత్తం 1,87,389 మంది అభ్యర్థు లలో 1,79,694 మంది అభ్యర్థులు రెండు పేప ర్లకూ హాజరయ్యారు. అర్హత సాధించిన అభ్య ర్థుల సంఖ్యలో ఐఐటి మద్రాస్ జోన్ అగ్రస్థా నంలో నిలిచింది (14,294 మంది); ఆ తర్వాతి స్థానాల్లో ఐఐటి బాంబే (12,389 మంది), ఐఐటి ఢిల్లీ (10,697 మంది) నిలిచాయి. పరీ క్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను చూసుకోవడంతో పాటు, తుది ఆన్సర్ కీని అధికా రిక జెఇఇ అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫలితాన్ని డౌన్‌లోడ్ చేసుకోవడా నికి, అభ్యర్థులు తమ రోల్ నంబర్, పుట్టిన తేదీ, నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌ను ఉపయో గించి లాగిన్ అవ్వవచ్చు. జెఇఇ అడ్వాన్స్‌డ్ 2026 తుది జవాబు కీ కూడా సోమవారం విడు దలయ్యింది, అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ అనేది ఇండియన్ ఇన్ స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, దేశవ్యాప్తంగా ఉన్న అనేక ఇతర ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థలలోని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశానికి ఒక ద్వారం వంటిది.

# బెంగాల్‌లో మంత్రివర్గ విస్తరణ

- మంత్రులుగా 35 మంది శాసనసభ్యులు ప్రమాణం
- 41కి చేరిన మంత్రిమండలి సంఖ్య



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి సువేందు అధికారి తన మంత్రివర్గాన్ని సోమ వారం విస్తరించారు. గవర్నర్ ఆర్.ఎన్. రవి 35 మంది ఎమ్మెల్యేలతో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతొ ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని మంత్రి మండలి సంఖ్య 41కి చేరింది. 13 మంది బిజెపి ఎమ్మె ల్యేలు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయగా, ముగ్గురు రాష్ట్ర మంత్రులుగా (స్వతంత్ర బాధ్యతలతో), మరో 19 మంది రాష్ట్ర మంత్రు లుగా మంత్రి మండలిలో చేరారు. కోల్‌కతాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి అధికారి, ఆయన మంత్రివర్గంలోని ప్రస్తుత మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధి కారులు పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన బిజెపి ఎమ్మెల్యేలు స్వపన్ దాస్‌గుప్తా, శంకర్ ఘోష్, అర్జున్ సింగ్, తపస్ రాయ్, శరద్వత్ ముఖర్జీ, జగ న్నాథ్ ఛటోపాధ్యాయ్ క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు దుధ్ కుమార్ మండల్, దీపక్ బర్మన్, మనోజ్ ఓరాన్, గౌరీ శంకర్ ఘోష్ కూడా క్యాబి నెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సువేందు అధికారి ప్రభుత్వంలో బిజెపి శాసనస భ్యులు రాజేష్ మహతా, ఇంద్రనీల్ ఖాన్, మాలతి రావా రాయ్ రాష్ట్ర మంత్రులుగా (స్వతంత్ర బాధ్య తలతో) ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర మంత్రు లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో జోయెల్ ముర్ము, అశోక్ దిండా, ఆనందమయ్ బర్మన్, కౌశిక్ చౌదరి, గార్గి దాస్ ఘోష్, భాస్కర్ భట్టాచార్య, దిబాకర్ ఘరామి, సుమనా సర్కార్ ఉన్నారు. బిజెపి ఎమ్మెల్యేలు శాంతను ప్రమా ణిక్, పూర్ణిమ చక్రవర్తి, ఉమేష్ రాయ్ కూడా రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం మంత్రుల సంఖ్య 41కి చేరింది. 294 మంది సభ్యులు కలిగిన రాష్ట్ర అసెంబ్లీలో ఒక ప్రభుత్వం కలిగి ఉండగలిగే గరిష్ట మంత్రివర్గ సంఖ్య కంటే ఇది మూడు తక్కువ. మే 9న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి కేంద్ర నాయకత్వం, ఎన్.డి.ఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమ క్షంలో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు వారాల తర్వాత ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

# ఢిల్లీలో డికె, సిద్ధరామయ్య బిజీబిజీ

కర్నాటక నూతన మంత్రిమండలి కూర్పుపై అధిష్టానంతో సంప్రదింపులు



**న్యూఢిల్లీ :** కర్నాటక నూతన ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ బుధవారం నాడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త రాష్ట్ర మంత్రి వర్గ కూర్పుపై కాంగ్రెస్ అధిష్టానంతో సంప్రదిం పులు జరిపేందుకు డి.కె. శివకుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్ధరామయ్య సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. శనివారం కర్ణాటకలో కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడిగా లాంఛ నంగా ఎన్నికై, సిద్ధరామయ్య స్థానాన్ని భర్తీ చేస్తున్న శివకుమార్... బుధవారం సాయంత్రం 4:05 గంటలకు, తన మంత్రివర్గంలోని ఎంపిక చేసిన సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ పర్యటన గురించి అడిగినప్పుడు, ఢిల్లీలోని 'కర్ణాటక భవన్'లో బస చేసిన శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ 'మేమే నిర్ణయించుకోవాలి' అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో, సిద్ధరామయ్య దేశ రాజధాని లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో బస చేస్తున్నారు. కర్ణా టక మంత్రివర్గ పరిమితి (ముఖ్యమంత్రితో కలిపి) 34 స్థానాలకు పరిమితమై ఉండటం, ఆ పరిమిత స్థానాల కోసం ఆశావహుల సంఖ్య భారీగా పెరిగిపోతుండటంతో... కాబోయే ముఖ్యమంత్రిగా శివకుమార్ తన తొలి,అత్యంత కీలకమైన పరీక్షల్లో ఒకదానిని ఎదుర్కొంటున్నారు. మంత్రివర్గంలో చోటు దక్కని వారిలో తీవ్ర అసంతృప్తి చెలరేగే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు అంగీకరించాయి. తనతో పాటు ఎంతమంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆదివారం నాడు అడిగినప్పుడు, శివకు మార్ స్పందిస్తూ 'నాకు తెలియదు. పార్టీ అధి ష్టానం ఏది నిర్ణయిస్తే అదే జరుగుతుంది. దానిపై నేను వ్యాఖ్యానించదలుచుకోలేదు' అని అన్నారు. మంత్రి పదవుల ఆశావహులు భారీ సంఖ్యలో జాతీయ రాజధానికి చేరుకున్నారు. జీ మాజీ మంత్రులు, శాసనసభ్యులు తమ అభ్యర్థనలను వినిపించేందుకు శివకుమార్, సిద్ధరామయ్య ఇద్ద రినీ కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్త మంత్రి వర్గం పాత ముఖాలు, కొత్తవారి కలయికగా ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి. ఇందులో కుల సమీకరణాలు, ప్రాంతీయ సమతు ల్యత, విధేయత అంశాలకు ముఖ్యంగా సిద్ధరా మయ్య వర్గం పట్ల విధేయతకు ఎంతో జాగ్రత్తగా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభు త్వంలో ఒకటి కంటే ఎక్కువ ఉప ముఖ్యమంత్రి పదవులు ఉండే అవకాశం ఉందని, అలాగే సిద్ధరా మయ్య నేతృత్వంలోని గత మంత్రివర్గంలోని పలు వురు మంత్రులకు ఈసారి చోటు దక్కకపోవచ్చని విస్తృతంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## ఇద్దరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసిన తృణమూల్ కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డ్డారనే ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్ సోమ వారం ఇద్దరు ఎమ్మెల్యేలు సందీపన్ సాహా, రీటా బ్రత బెనర్జీలను బహిష్కరించింది. రాష్ట్ర సచివాల యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్య మంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో నకిలీ సంతకాల కేసుకు సంబంధించి వీరిద్దరూ ఫిర్యాదులు చేశారని చెప్పిన కొద్ది నిమి షాలకే ఈ బహిష్కరణ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ అసెంబ్లీలోనే టిఎంసి శోభన్‌దేబ్ చటోపాధ్యా యను ప్రతిపక్ష నాయకుడిగా ఆమోదించింది. ఎఐటిసి నామినేట్ చేసిన అభ్యర్థిగా ఎన్నికైనప్ప టికీ, మీరు పార్టీ అధీకృత నాయకత్వం ఏర్పాటు చేసిన సమావేశాలకు పదేపదే హాజరుకావడం లేదని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొం టున్నారని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ అధిష్టాన వర్గం ద్వారా దాని దృష్టికి తీసుకురాబ డిందని ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకు పంపిన ఒక లేఖలో పేర్కొన్నారు. 'మీరు ఎఐటిసి ప్రయోజనా లకు హాని కలిగించే కార్యకలాపాలలో పాల్గొన్నా రని, అలాంటి ప్రకటనలు చేశారని కూడా గమ నించబడింది' అని పార్టీ ఉపాధ్యక్షురాలు చంద్రమా భట్టాచార్య సంతకం చేసిన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చిన అనంతరం, 'మిమ్మల్ని పార్టీ (ప్రాథమిక) సభ్యత్వం నుండి తక్షణమే బహిష్కరించాలని ఎఐ టిసి అదిష్టాన వర్గష్టాన వర్గం నిర్ణయించినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. శోభన్‌దేబ్ చటోపాధ్యా యను ప్రతిపక్ష నాయకుడిగా ఆమోదిస్తూ అసెంబ్లీ సెక్రటేరియట్‌కు సమర్పించిన ఒక లేఖలో పార్టీ శాసనసభ్యుల నకిలీ సంతకాలను ఉపయోగించారన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ సిఐడి దర్యాప్తు జరుపుతోంది.

## ల‌డ్కీ బహీన్ పథకానికి 80 లక్షల మంది మహిళలు అనర్హులు

మహారాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపాటు





**ముంబయి :** ఇకెవైసి గడువు ముగియడంతో మహారాష్ట్రలో అమలవుతున్న 'ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బహీన్' పథకానికి సుమారు 80 లక్షల మంది మహిళలు అనర్హులయ్యారు. ఈ నేప థ్యంలో ప్రతిపక్షాలు నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా మహారాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను తొలగిస్తోం దని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే, ఏప్రిల్ 30న ఇకెవైసి గడువు ముగిసిన తర్వాత లబ్ధిదా రుల సంఖ్య 2.4 కోట్ల నుంచి దాదాపు 1.7 కోట్లకు పడిపోయిందని, కానీ అర్హతా ప్రమాణా లను పాటించకపోవడం కూడా ఈ అనర్హతలకు ఒక కారణమని సోమవారం ఒక సీనియర్ అధి కారి తెలిపారు. లబ్ధిదారులు తమ ఇకెవైసిని పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం ఎనిమిది నెలల గడువు ఇచ్చిందని ఆయన అన్నారు. 'సుమారు 50 నుంచి 55 లక్షల మంది మహిళలు ఈ ప్రక్రియను పూర్తిగా పూర్తి చేయడంలో విఫలమయ్యారు, కాగా ఈ కాలంలో రెండు నుంచి మూడు లక్షల మంది తప్పులను సరిదిద్దుకున్నారు. అదనంగా, దాదాపు 12 లక్షల మంది మహిళలు రూ. 2.5 లక్షల వార్షిక ఆదాయ పరిమితిని మించి ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లు, 4.5 లక్షలకు పైగా మహిళలు 65 సంవత్సరాల గరిష్ట వయోపరిమితిని దాటి నట్లు గుర్తించబడింది' అని ఆ అధికారి తెలిపారు. నమో షేత్కారి పథకం కింద ఇప్పటికే సుమారు ఐదు లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతున్నా రని ఆయన చెప్పారు. ఇకెవైసి పూర్తి చేసుకున్న మహిళలు నెలవారీ వాయిదాలు అందుకోలేకపో యారన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, 'నిజమైన లబ్ధి దారుల తుది సంఖ్య వారంలో స్పష్టమవుతుంది, ఫిర్యాదులను క్రాస్‌వెరిఫై చేస్తున్నాము' అని ఆ అధికారి పేర్కొన్నారు. కేవలం ఇకెవైసి పూర్తి చేయని కారణంతో 80 లక్షల మంది మహిళలను పథకం నుంచి తొలగించారన్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఇదిలా ఉండగా, పథకం నుంచి లబ్ధిదారులను తొలగిం చడం రాష్ట్రం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుందని ప్రతిపక్ష ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు జయంత్ పాటిల్ పేర్కొ న్నారు. లోక్‌సభ ఎన్నికలలో అధికార మహా యుతి కూటమి పేలవమైన పనితీరు కనబరచ డంతో, అర్హులైన మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందించే ఈ పథకాన్ని 2024 రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు ప్రారంభిం చారని పాటిల్ ఆరోపించారు. 'ఇప్పుడు, ఏకంగా 80 లక్షల మంది మహిళా లబ్ధిదారులను అనర్హు లుగా ప్రకటించారు. సహాయం చేస్తామని వాగ్దానం చేసిన వారినే ఇది విడిచిపెట్టడమే' అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై పెరుగుతున్న ఆర్థిక భారం గురించి ఈ చర్య సూచిస్తోందని మాజీ మంత్రి పేర్కొన్నారు. 'లడ్కీ బహీన్' పథ కాన్ని నిలిపివేయాలనే అంతిమ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను క్రమంగా తొలగిస్తోం దని ఎన్‌సిపి (ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పథకంలో 2.47 కోట్ల మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పుడు సుమారు 81 లక్షల మంది మహిళల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొల గించారని పవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 6న ఢిల్లీకి కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు



**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈనెల 6వ తేదీన భారత్ రానున్నాడు. ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాల అంశంలో నైతిక బాధ్యత తీసుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిర్వ హించే శాంతియుత ప్రదర్శనలో ఆయన పాల్గొన నున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీప్కే ఓ వీడియో రిలీజ్ చేశాడు. ఢిల్లీలో జరిగే ఆ నిరసన కార్యక్ర మంలో మద్దతుదారులు, విద్యార్థులు పాల్గొవాలని పిలుపు ఇచ్చారు. అందరం దగ్గరకు రావాల్సిన సమయం ఆసన్నమైందని, భారత రాజ్యాంగం అడుగుజాడల్లో.. మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీ నామా డిమాండ్ కోరుదామన్నాడు. మనం మన గళం విప్పితే, దానికి వాళ్లు తప్పకుండా వింటార న్నారు. జూన్ 6వ తేదీన తన మద్దతు దారులందరూ విమానాశ్రయానికి చేరుకోవాలని తన వీడియో మెసే జ్‌లో పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నేను ఢిల్లీకి చేరుకుంటా నని, అందరూ విమానాశ్రయానికి రావాలని, కలిసికట్టుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్దామని దీప్కే అన్నాడు. జంతర్ మంతర్‌లో శాంతియుత ప్రదర్శన కోసం పర్మిషన్ అడుగుదామన్నాడు. నీటి, సిబిఎస్ఇ లాంటి పరీక్షల సంబంధిత వివాదాల వల్ల విద్యా ర్థులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని దీప్కే అన్నారు. సోషల్ మీడియా ఆధారంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఆ పార్టీని సబ్‌స్క్రైబ్ చేస్తున్న వారి సంఖ్య కూడా కోట్లకు చేరుకున్నది.

## భద్రతా ఏర్పాట్లపై దక్షిణ మధ్య రైల్వే జిఎం సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మ ధ్య రైల్వే పరిధిలో మాన్సూన్ సమయ ంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్య లపై జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో రా నున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైలు భద్రతా ఏర్పాట్లపై సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఉ న్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. రైల్వే పట్టాలు, ఓవర్ హెడ్ ఎ క్విప్‌మెంట్ సమీపంలో పెరిగిన చెట్లు, కొమ్మలను వెంటనే తొలగించి ప్రమా దాలు జరగకుండా చూడాలని జీఎం స్పష్టం చేశారు. ఫీల్డ్ సూపర్వైజర్లు ఎప్ప టికప్పుడు అప్రమత్తంగా ఉండి ఏ చిన్న సమస్య వచ్చినా ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. రైళ్ల సురక్షిత రాకపోకలకు భంగం కలి గించే దుండగ చర్యలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశిం చారు. పట్టాలపై ఇనుప వస్తువులు, నిర్మాణ సామగ్రి వదిలివేయడం వంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొ న్నారు. ముఖ్య ప్రాంతాల్లో 24 గంటల పర్యవేక్షణ కొనసాగించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేయాలని జీఎం ఆదే శించారు. వర్షాకాలంలో కూడా రైలు సేవలు నిరంతరాయంగా, సురక్షి తంగా కొనసాగేందుకు అన్ని విభా గాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో అద నపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ విభాగాల ముఖ్యాధికా రులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌ల డివిజ నల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్.**

టెండర్ నోటీస్ ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)

NIT No. 06/EE/CMC/CIR-48/2026-27 తేది: 01.06.2026

నం. 06/EE/CMC/CIR-48/2026-27 (ఐటెమ్స్ నెం. 01 నుండి 03 వరకు), తేది: 01.06.2026 ద్వారా, రూ. 21.10 లక్షల అంచనా వ్యయంతో కూడిన (03) పనుల కోసం 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లు ఆహ్వానించబడ్డాయి. 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల విక్రయం 02.06.2026 తేదీన ఉదయం 11:30 గంటల నుండి ప్రారంభమవుతుంది. బిడ్లను సమర్పించేడానికి చివరి తేదీ: 09.06.2026, ఉదయం 11:30 గంటలు; బిడ్ల విక్రయం, బిడ్ల సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

నం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్: సిఎంసి

DIPR R.O. No. : 3392-PP/CL/ADVT/2026-27, Date: 01-06-2026

తెలంగాణప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
నమూనా - ఫారం - 1 (నిబంధన 4 (1) చూడగలరు)

**వంశ పారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం**

Memo No.F5/8793/2026-2, Date: 29.05.2026 ప్రకారం శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ గారు జగిత్యాల్ జిల్లాలో గల **1)** శ్రీ గండి హనుమాన్ దేవాలయం, బండలింగాపూర్ (V), ఇబ్రహీంపట్నం(M), జగిత్యాల జిల్లా, **2)** శ్రీ ఎడ్మాల లక్ష్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్, మెట్పల్లి (T&M), జగిత్యాల జిల్లా. **3)** శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, వెంకటాపూర్ (వి), కోరుట్ల (ఎం), జగిత్యాల జిల్లా. **4)** శ్రీ గంగా గౌరీశ్వర దేవాలయం, వి.వి.రావుపేట (V), మల్లాపూర్ (M), జగిత్యాల జిల్లా. **5)** శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, కోరుట్ల టౌన్ & మండలం, జగిత్యాల జిల్లా. **6)** శ్రీ మల్లికార్జున గంగామాత దేవాలయం, ఎర్దండి (V), ఇబ్రహీంపట్నం(M), జగిత్యాల జిల్లా. **7)** శ్రీ ఎల్లమ్మ దేవాలయం, వెల్లుల్లా (V), మెట్పల్లి (M), జగిత్యాల్ జిల్లా (కొత్తగా తీసుకోబడింది). **8)** శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, కోరుట్ల (V&M), జగిత్యాల జిల్లాలకు ట్రస్ట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చియున్నారు.

మరియు Memo No.F5/5369/2026, Date: 29.05.2026 ప్రకారం శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ గారు పెద్దపల్లి జిల్లాలో గల **1)** శ్రీ మహలక్ష్మి దేవాలయము, మంథని (V&M), పెద్దపల్లి జిల్లా. **2)** శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దేవాలయము, మంథని (V&M), పెద్దపల్లి జిల్లా లకు ట్రస్ట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చియున్నారు.

ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా! ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పై దేవస్థానమునకు నోటీసులు ప్రచురించబడిన తేది నుండి 20 రోజుల అనంతరము దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టము 30/1987 (సవరించబడిన చట్టము 33/2007. రూల్ (4), సబ్ రూల్ (1) సెక్షన్, 15 ఉప సెక్షన్ (2) కి లోబడి వంశపారంపర్యకాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తగా నియామకము కొరకు వారి దరఖాస్తులను సెక్షన్ 17 నందలి ఉప సెక్షన్ (3) ననుసరించి నిర్ణిత ప్రోఫోర్మా (ఫారము-II) లో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజుల లోపు శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ గారికి లేదా శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, కరీంనగర్ జిల్లా వారికి పంపవచ్చును.

నం/- యం. హనుమంతరావు, డైరెక్టర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్.

DIPR R.O. No. : 3364-PP/CL/ADVT/2026-27, Date: 01-06-2026

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
02-06-2026
www.prajapaksham.in


## లెబనాన్‌లో పరిణామాలపై

# భద్రతామండలి అత్యవసర సమావేశం



**న్యూయార్క్:** లెబనాన్‌లో పరిస్థితులు అత్యంత హీనస్థితికి చేరుకోవడంతో ఫ్రాన్స్ విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించింది. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు లిటానీ నది దాటివెళ్ళి వందల ఏళ్ళ చరిత్రగల కోటను 26 సంవత్సరాల తర్వాత మరోసారి స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో లెబనాన్‌లో యుద్ధం విరమించాలని భద్రతామండలి అత్యవసర సమావేశం కోరే అవకాశాలున్నాయి. లెబనాన్ కేంద్రంగా చేసుకుని ఇరాన్‌కు మద్దతు ఇస్తూ ఇజ్రాయెల్‌పై పోరాటం చేస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాలను నిర్మూలించాలని ఐ.డి.ఎఫ్ కంకణం కట్టుకుంది. హెజ్బొల్లాను నిర్మూలించేందుకు మార్చి రెండో తేదీన లెబనాన్‌పై దాడులు ప్రారంభించింది.దాదాపు 70 శాతం దక్షిణ లెబనాన్ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఇప్పుడు తాజాగా బ్యూఫోర్ట్ కోటను స్వాధీనం చేసుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీరూట్ దక్షిణ శివారు ప్రాంతంలో దాడులను ఉద్ధృతం చేయాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ సోమవారం కొత్త ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు హెజ్బొల్లా కూడా ఉత్తర ఇజ్రాయెల్ కోస్తా నగరం హైఫాపై రాకెట్ దాడులు చేస్తోంది. తమ పౌరులపై హెజ్బొల్లా అదేపనిగా దాడులు చేస్తోందని, దీనిని సహించబోమని నెతన్యాహూ ప్రకటించారు. నెతన్యాహూ కొత్త ఆదేశాలతో దక్షిణ లెబనాన్‌లో దహియేహ్ నుండి వేలాదిమంది ప్రజలు పారిపోవడం ప్రారంభించారు. దీంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి.

అమెరికా మధ్యవర్తిత్వంతో ఏప్రిల్ 17వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినాగానీ ఇజ్రాయెల్ దానిని ఉల్లంఘించి దాడులు కొనసాగిస్తోంది. తమ పోరాటం ఇంకా ఆగిపోలేదని, హెజ్బొల్లాను పూర్తిగా అంతం చేస్తామని, వారిని నిరాయుధులను చేస్తామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరించారు. యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ లెబనాన్‌లో 3,371 మంది మరణించారు. మరో 24 మంది ఇజ్రాయెల్ సైనికులు,నలుగురు ఇజ్రాయెల పౌరులు మరణించారు.

## అణచివేత, ప్రతికూలత మధ్య

# ఇథియోపియా పార్లమెంటు ఎన్నికలు



**ఆడిస్‌అబాబా:** తూర్పు ఆఫ్రికాదేశం ఇథియోపియా పార్లమెంటుకు సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 547 స్థానాలున్న ప్రతినిధుల సభకు అభ్యర్థులను ఓటర్లు ఎన్నుకుంటారు. ప్రధానమంత్రి అబిద్ అహ్మద్‌ను ప్రజలు నేరుగా ఎన్నుకోరు. పార్లమెంటులో ఈ ప్రక్రియ జరుగుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ రాజకీయ పార్టీ అయినా 274 సీట్లు మెజారిటీ తప్పనిసరిగా సాధించాలి. దీంతోపాటు దేశంలో ఉన్న మరో 2,500 ప్రాంతీయ కౌన్సిల్ సీట్లకు కూడా పోలింగ్ ప్రక్రియ జరిగింది. ఐతే ఇథియోపియాలో అనేక ప్రతిపక్ష పార్టీలను ఎన్నికల్లో పోటీ చేయనీయకుండా కట్టడి చేశారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాలలో పోలింగ్ ప్రక్రియ నిర్వహించలేదు. ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్న పాలక ప్రోస్పెరిటీ పార్టీ సరికొత్త ప్రజాస్వామ్య దశను ప్రారంభించే ప్రక్రియగా ఈ ఎన్నికలను అభివర్ణించింది. 1991 నుండి దేశంలో టైగ్రే ప్రాంత రాజకీయ నాయకుల ఆధిపత్యంలో ఉన్న ఇథియోపియన్ పీపుల్స్ రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ అధికారంలో ఉంది. 2018లో ఈ ఫ్రంట్‌లోనే భాగస్వామిగా ఉన్న అబియ్ అహ్మద్ పెద్ద ఉద్యమం నడిపి ప్రధానమంత్రి పదవి చేపట్టారు. తర్వాత ఈ ఫ్రంట్‌ను రద్దుచేసి ప్రోస్పెరిటీ పార్టీని స్థాపించారు. మొదటిసారి ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత వందలమంది రాజకీయ ఖైదీలను, జర్నలిస్టులను జైళ్ళ నుండి విడుదల చేయడంతో ఆయనను ప్రజలు పెద్ద యోధుడుగా కీర్తించారు. అధికారం చేపట్టాక పొరుగున ఎరిత్రియాతో ఇరవై ఏళ్ళుగా సాగుతున్న అంతర్యుద్ధాన్ని ముగించేందుకు సంధి చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఆయనకు ఆనాడు నోబెల్ బహుమతి లభించింది. కానీ ఇప్పుడు ఆయన క్రమంగా ఒక నియంతగా మారుతున్నారు. ఇప్పుడు ఏడు సంవత్సరాలు గడచిపోయాయి. అబియ్ అహ్మద్ ప్రతిష్ఠ మసకబారిపోయింది. ఈనాడు 13.50 కోట్ల జనాభాతో దేశం ఘర్షణలతో నిండి ఉంది. భావ ప్రకటన అణచివేతకు గురైంది. ఆయన ప్రతిపక్షాలను అణచివేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు. చాలాచోట్ల పోలింగ్ నిర్వహించలేదు. ప్రతిపక్షాలు తమ రాజకీయ రిజిస్ట్రేషన్ కోల్పోకూడదనే ఉద్దేశంతో అనివార్యంగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. రిపోర్టర్స్ విదౌట్ బోర్డర్స్ నివేదిక ప్రకారం 180 దేశాలలో ఇథియోపియా పత్రికాస్వేచ్ఛలో 148వ స్థానానికి దిగజారిపోయింది. అంతర్జాతీయ వార్తాసంస్థలను ఆయన అణచివేస్తున్నారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరిగింది. ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం ఆఫ్రికా ఖండంలో నైజీరియా తర్వాత ఎక్కువ జనాభాగల రెండో దేశం ఇథియోపియా.

# మాల్టాలో లేబర్‌పార్టీ చారిత్రక విజయం

**వల్లెట్టా:** ఐరోపాలో ఇటలీ సమీపంలోని అతిచిన్న దేశం మాల్టాలో నిర్వహించిన మెరుపు ఎన్నికలలో లేబర్‌పార్టీ వరుసగా నాలుగోసారి సార్వత్రిక ఎన్నికలలో చారిత్రక విజయం రికార్డు సృష్టించింది. నిర్ణీత ప్రకారం 2027లో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉండగా అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్ళ నేపథ్యంలో దేశ ప్రధానమంత్రి ఏడాది ముందుగానే మెరుపు ఎన్నికలకు పిలుపు ఇచ్చారు. శనివారం పోలింగ్ అనంతర విజయంతో సోమవారం ఆయన తిరిగి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1966 నుండి ఇప్పటివరకూ దేశంలో లేబర్‌పార్టీ లేదా నేషనలిస్ట్‌పార్టీలు మాత్రమే వరుసగా ఎన్నికల్లో విజయాలు సాధిస్తూ దేశాన్ని పాలిస్తున్నాయి. మధ్యధరాసముద్రంలో ద్వీప సమూహ దేశాలలో ఒకటి మాల్టా 1974లో గణతంత్ర ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించింది. 2022 ఎన్నికల్లో మూడోసారి విజయం సాధించిన లేబర్‌పార్టీ నాలుగోసారికూడా ఘన విజయం సాధించడంతో దేశంలో పార్టీ వేడుకలు మిన్నంటాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. ప్రధానమంత్రి రాబర్ట్ అబెలా తనపై విశ్వాసం ఉంచినందుకు ఈ సందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఐతే ఈసారి గతంకంటే కొంచెం మెజార్టీ తగ్గింది. ‘‘మేం ప్రజలందరి కోసం ఎన్నో కార్యక్రమాలు చేశాం, ఇది ప్రజలందరి విజయం, తమ పార్టీ బలమైన మెజార్టీ సాధించింది’’ అని అబెలా పత్రికావిలేకరుల సమావేశంలో చెప్పారు. ఐతే పశ్చిమాసియాలో యుద్ధంవల్ల ద్రవ్యోల్బణం పెరిగే పరిస్థితి వచ్చింది. ప్రతిపక్ష నాయకుడు, నేషనలిస్ట్‌పార్టీ నాయకులు అలెక్స్ బోర్గ్ తన ఓటమి అంగీకరించారు. ‘‘చాలామందికి ఇది నిరాశ కలిగించే రోజు, ఈ విషయం నాకు తెలుసు, మనం ఆశను నమ్మాం, మనం ఎప్పుడూ చింతించకూడదు’’ అని బోర్గ్ అన్నారు. గడచిన శనివారం మాల్టాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 87.4 శాతం పోలింగ్ జరిగింది. 2022 కంటే ఈ సారి పోలింగ్ శాతం బాగా పెరిగింది.

## ప్రతి పేదకూ ఇల్లు (మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలనప్రగతి బహిరంగ సభలో పాల్గొని సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 25 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన రాజకీయ కార్యాచరణను నిర్మల్ జిల్లా నుంచి ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సాక్షిగా ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభించామని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో పాలమూరుకు ఎంత ప్రాధాన్యం ఉందో ఆదిలాబాద్ జిల్లాకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఏ సంక్షేమ కార్యక్రమమైనా ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. నాగోబా జాతర సందర్భంగా ఆదివాసీల సమస్యలను స్వయంగా తెలుసుకున్నానని, వారి చిరకాల కోరిక మేరకు గూడెలు, లంబాడీ తండాలకు అదనంగా 25 వేల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇంకా ఇళ్లు రాని అర్హులందరికీ ఇళ్లు అందించాలని గృహనిర్మాణ శాఖను ఆదేశించినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇల్లు అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సంవత్సరం తిరిగేలోపు ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే నిధుల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని సిఎం పేర్కొన్నారు. మరో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఇదే వేదికపై రాష్ట్రవ్యాప్తంగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. కేంద్ర మంత్రులు తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరిన సిఎం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం, మక్క, జొన్న, పొద్దుతిరుగుడు పంటలను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 75 లక్షల క్వింటాళ్ల వడ్ల సేకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కేంద్రం కూడా వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఆసిఫాబాద్ ఎంఎల్‌ఏ కోవా లక్ష్మి , మంచిర్యాల ఎంఎల్‌ఏ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, పెద్దపల్లి ఎంపి వంశీ, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఏలు బొజ్జు పటేల్, మాజీ ఎంఎల్‌ఏలు ఆత్రం అక్కు, ఇంద్రకరణ్ రెడ్డి, ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు సుగుణ, పాల్గొన్నారు.

# ఏడాదిలో లక్ష ఇండ్లు నిర్మిస్తాం

**కొమురం భీం జిల్లా నుంచే రెండో విడతకు శ్రీకారం : సిఎం రేవంత్ రెడ్డి**
**ఆదివాసీల కోసం ఇప్పటికే 21 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి**
**మహిళా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు.. ఆదిలాబాద్ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం**



ప్రజాపక్షం/కెరిమేరి : రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఏడాది తిరిగే సరికి ప్రతి గూడెం, ప్రతి తండాలో పండగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్లు కనిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని కెరిమేరి మండలం కోటారి, కొత్తగూడ గ్రామాల్లో నిర్మించిన 25 సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ఇండ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ ఆదివాసీ నృత్యాలు, సంప్రదాయ పద్ధతులతో గిరిజనులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆదివాసీ చిన్నారులు ఇప్పపువ్వు లడ్డూ, బెల్లం అప్పాలతో ముఖ్యమంత్రిని ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం ఆదివాసీలతో కలిసి సిఎం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ఆసిఫాబాద్ ఎంఎల్‌ఏ కోవా లక్ష్మి , డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఆదివాసీలతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రజలతో నేరుగా ఆదివాసీ, గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణానికి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని, మంజూరైన ఇండ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇల్లు లేని ఆదివాసీ కుటుంబం ఉండకూడదని, అలాగే స్వంత ఇల్లు లేని పేదవారు కూడా ఉండకూడదని పేర్కొన్నారు. ఏడాది లోపు లక్ష ఇండ్ల నిర్మాణం చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఆదివాసీల కోసం ఇప్పటికే 21 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని వెల్లడించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సిఎం అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో బస్సులు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివాసీ యువత చదువులో ముందుండాలని, జీవితాల్లో మార్పు తీసుకురావడానికి విద్యే ప్రధాన ఆయుధమని సిఎం సూచించారు. వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరస్పర దాడులు
(మొదటి పేజీ తరువాయి)

ఐఆర్‌జిసి పేర్కొంది. నెలల తరబడి జరిగిన యుద్ధం నివారించేందుకు జరుగుతున్న చర్చలు ముందుకు కదలకుండా నిలిచిపోవడంతో తాజా ఘర్షణలు ప్రతిష్ఠంభనకు ప్రతీకగా నిలిచాయి. తమ ఎంక్యూ–1 డ్రోన్‌ను కూల్చివేసినందుకు ప్రతీకారంగా ఇరాన్ డ్రోన్, రాడార్ నియంత్రణ వ్యవస్థలపై ఆత్మరక్షణ దాడులు చేసినట్లు అమెరికా సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ దక్షిణ తీర సమీపంలోని గోరుక్ నగరంలో, హోర్ముజ్ జలసంధిలోని ఖ్మేష్ ద్వీపంలో ఉన్న ఇరాన్ రాడార్–డ్రోన్ కమాండ్ కంట్రోల్ స్థావరాలపై శనివారం,ఆదివారం వరుసగా ఆత్మరక్షణ దాడులు చేసినట్లు ఎక్స్ వేదికగా పేర్కొంది. ఈ దాడులు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విమర్శించారు. గల్ఫ్‌లోని సిరిక్ ద్వీపంపై దాడులు చేయడం కోసం అమెరికా ఉపయోగిస్తున్న ఒక వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నామని ఐ.ఆర్.జి.సి ప్రకటించింది. ఎక్కడ దాడులు చేసిందీ స్పష్టంగా ప్రకటించలేదు. అమెరికా దాడులు పునరావృతమైతే తమ ప్రతిస్పందన పూర్తి భిన్నంగా ఉంటుందని ఇరాన్ సైన్యం ప్రకటించినట్లు ఫార్స్ వార్తాసంస్థ పేర్కొంది.

అదేవిధంగా సోమవారం తెల్లారుజామున శత్రువులు (ఇరాన్) కువైట్‌లో క్షిపణి,డ్రోన్లు దాడులు చేశారు.. శత్రు దాడులను నిలిపివేసేందుకు తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు సమర్థవంతంగా స్పందించాయని కువైట్ ప్రభుత్వం ప్రకటించింది.ఇరాన్ పదే పదే హేయమైనరీతిలో దాడులు చేస్తోందని కువైట్ విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది.ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలను ఇలాంటి దాడులు దెబ్బతీస్తాయని, తమను తాము రక్షించుకోవడానికి అవసరమైన ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా తమకు పూర్తి హక్కులున్నాయని కువైట్ హెచ్చరించింది. కాగా సోమవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ ‘‘మీరు వెనక్కు వాలి కూర్చుని విశ్రాంతి తీసుకోండి, చివరాఖరుకు అన్నీ సజావుగా జరుగుతాయి, ఇరాన్ నిజంగా ఒక ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోంది, అన్నీ అమెరికాకు అనుకూలంగా ఉంటాయి, అమెరికాకు మేలు జరుగుతుంది’’ అని విమర్శకులపై విసుర్లు వేశారు. ఎంఓయు ముసాయిదా ఒప్పందంలో భారీ మార్పులు చేయాలని ట్రంప్ డిమాండ్ చేసిన పూర్వరంగంలో అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర దాడులు జరిగాయి. అణ్వాయుధంపై చర్చ, శుద్ధి చేసిన యురేనియం స్వాధీనాంశాలు ముసాయిదా ఒప్పందంలో లేవని ఇరాన్ ప్రకటించగా, తాము కోరుకున్న విధంగా లేకపోతే ఈ ఒప్పందం మరోవిధంగా ముగుస్తుందని ట్రంప్ ఆదివారం ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఎలాంటి సుంకాలు, ఫీజులు వసూలు చేయకూడదు, శుద్ధిచేసిన యురేనియం స్వాధీనం చేయాలి అనే అంశాలను ఎంఓయులో చేర్చాలనే కొత్త మార్పులు ట్రంప్ కోరుకుంటున్నారని సిబిఎస్ న్యూస్ పేర్కొంది. దీనిపై వ్యాఖ్యానించాల్సిందిగా పాత్రికేయులు కోరగా వైట్‌హౌస్ నోరు మెదపలేదు. ఇదే సమయంలో ఇస్మాయిల్ బఘాయీ స్పందిస్తూ, పరస్పర విరుద్ధమైన డిమాండ్లను నిత్యం అమెరికా ముందుకు తెస్తూ ఉండటం వల్ల సహజంగానే ఇది చర్చల పొడిగింపునకు దారితీస్తోందని విమర్శించారు. తమ హక్కులకు పూర్తి భద్రత కల్పించకపోతే ఇరాన్ ఏ ఒప్పందాన్నీ అంగీకరించబోదని ఆదివారం చర్చల్లో ఇరాన్ అనుసంధానకర్త ప్రకటించారు. లెబనాన్‌లో యుద్ధం ముగింపు కూడా ఒప్పందంలో ఉండాలని ఇరాన్ కోరుతోంది.

### మధ్యవర్తిద్వారా అమెరికాతో చర్చల్లేవ్ : ఇరాన్

మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఇక అమెరికాతో సంప్రదింపులు, సందేశాల మార్పిడిని నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు మితిమీరిపోవడంతోపాటు చరిత్రాత్మకమైన బ్యూఫోర్ట్ కోటను సోమవారంనాడు ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు చెలరేగాయి. దీనిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కూడా ఒక అత్యవసర సమావేశం నిర్వహించింది. ఇరాన్ అనుకూల హెజ్బొల్లా సైన్యాలను నిర్మూలించేందుకు ఐ.డి.ఎఫ్ పెద్ద ప్రయత్నాలు చేస్తూ ఉండటంతో ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దురాక్రమణను సహించబోమని ఇరాన్ నాయకత్వం ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకునే ముసాయిదా ఒప్పందంలో లెబనాన్‌లో యుద్ధ ముగింపు కూడా ఒక అంశంగా ఉండాలని ఇరాన్ భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో అమెరికాతో మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఇక ఎంతమాత్రం సంప్రదింపులు, సందేశాల మార్పిడులు చేయకూడదని నిర్ణయించింది. ఇరాన్‌కు చెందిన తస్నిమ్ వార్తాసంస్థ సోమవారం ఈ విషయం వెల్లడించింది.

## పద్ధతిలోనే ‘నీట్’
(మొదటి పేజీ తరువాయి)

విచారణను సుప్రీంకోర్టు జూలై 27కు వాయిదా వేసింది. కాగా, మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నీట్ యూజీ పరీక్ష నిర్వహించారు. అయితే ఆ తర్వాత ఆ పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనితో మే 12న ఎన్‌టిఎ నీట్ పరీక్షను రద్దు చేసింది. విద్యార్థులు, ప్రతిపక్షాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం ఈ పేపర్ లీక్ కేసును సిబిఐకు అప్పగించింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ పరీక్షను తిరిగి (రీటెస్ట్) జూన్ 21న నిర్వహించేందుకు ఎన్‌టిఎ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి లీకేజీలకు తావు లేకుండా పరీక్షను సిబిటి విధానంలో జరపాలని కోరుతూ ఆర్‌జెడి ఎంపి సుధాకర్ సింగ్‌తో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. వీటిపై విచారణ జరుపుతూ, పిటిషనర్ల తరపున హాజరైన అడ్వకేట్ సత్యం సింగ్ రాజ్‌పుత్‌ను ఉద్దేశించి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ‘రీఎగ్జామినేషన్ సిబిటి విధానంలో నిర్వహించే ప్రశ్నే లేదు. ఎన్‌టిఎ ఇప్పటికే చాలా సమస్యలను ఎదుర్కొంటోంది. నీట్ పరీక్ష రద్దు అయ్యింది కనుక ఇప్పుడు దానిని మళ్లీ నిర్వహిస్తున్నారు. కనుక ఈ పిటిషన్‌ను మేము ఇప్పుడే కొట్టివేయాలా లేదా వేసవి సెలవుల తర్వాత కొట్టివేయాలా?‘ అని ప్రశ్నించింది. దీనిపై న్యాయవాది సత్యం సింగ్ రాజ్‌పుత్ స్పందిస్తూ, ‘మేము నీట్ రీటెస్ట్‌ను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని మాత్రమే అభ్యర్థిస్తున్నాం. మరేమీ కాదు’ అని అన్నారు. అయితే ఇలాంటి పిటిషన్లను గతంలోనే సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. దీనిపై సత్యం సింగ్ రాజ్‌పుత్ స్పందిస్తూ, ‘రీఎగ్జామ్‌ను పెన్ అండ్ పేపర్ విధానంలో భౌతికంగా నిర్వహిస్తున్నారని, అయితే ఎలాంటి లీకేజ్‌లు లేకుండా ఉండేందుకు దానిని సిబిటి విధానంలో జరపాలి’ అని పట్టుబట్టారు. దీనిపై జస్టిస్ నరసింహ స్పందిస్తూ, ప్రస్తుతం ఎన్‌టిఎపై ఉన్న ఒత్తిడిని అర్థం చేసుకోవాలని న్యాయవాదికి సూచించారు.

## ఆవిర్భావ వేడుకలు
(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజా వేడుకలు నిర్వహించనున్నారు.

**తెలంగాణ ఆవిర్భావం.. పోరాట ఫలితం నుంచి ప్రగతిపథం వరకు....**

‘జూన్ 2’ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం ఆవిష్కృతమైన చారిత్రక దినం. దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు చేసిన త్యాగాలకు ప్రతిఫలంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఈనెల2వ తేదీన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ఇది కేవలం ఒక రాష్ట్ర ఆవిర్భావ వేడుక మాత్రమే కాకుండా ప్రజల స్వీయ పాలన ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన రోజు. తెలంగాణ ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే అది అన్యాయాలపై తిరుగుబాటు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో జరిగిన వివక్ష ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. 1969లో ప్రారంభమైన తొలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచి 2001 తర్వాత మళ్లీ ఉధృతమైన రెండో దశ ఉద్యమం వరకు తెలంగాణ ప్రజలు నిరంతర పోరాటం కొనసాగించారు. విద్యార్థుల ఆత్మాహుతులు, ఉద్యోగుల సమ్మెలు, ప్రజాసంఘాల నిరసనలు చివరకు దేశ రాజకీయాలను కదిలించాయి. ఫలితంగా 2014 జూన్ 2న భారతదేశ 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ పలు రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. సాగునీటి రంగంలో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, రైతుబంధు వంటి పథకాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. గ్రామీణాభివృద్ధి, పల్లె ప్రగతి, పట్టణాభివృద్ధి, ఐటి రంగ విస్తరణలో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుంది. హైదరాబాద్ ప్రపంచస్థాయి పెట్టుబడుల కేంద్రంగా ఎదగడం, ఫార్మా, ఐటి, స్టార్టప్ రంగాల్లో రాష్ట్రం సాధించిన పురోగతి తెలంగాణ ఆర్థిక బలాన్ని పెంచింది. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగాల్లో కూడా రాష్ట్రం ముందడుగు వేసింది. దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. అయితే అభివృద్ధి ప్రయాణంలో సవాళ్లు కూడా తక్కువ కావు. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ ప్రాంతాల్లో అసమానతలు, ప్రభుత్వ అప్పులు, పర్యావరణ సమస్యలు ఇంకా ఆందోళన కలిగించే అంశాలుగానే ఉన్నాయి. రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న అసలు లక్ష్యాలు అయిన సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల పూర్తిస్థాయిలో సాధించాల్సి ఉంది.

**తెలంగాణ ఉద్యమం నేర్పిన పాఠం**

ప్రజల సంకల్పం ముందు ఏ శక్తి నిలువలేదని, అదే స్ఫూర్తితో ఇప్పుడు తెలంగాణను మరింత సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వం, రాజకీయ నాయకులు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడిపై ఉంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన కర్తవ్యం. వారి కలల తెలంగాణ నిర్మాణమే వారికి నిజమైన నివాళి. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరినప్పుడే తెలంగాణ ఆవిర్భావానికి పూర్తి అర్థం సిద్ధిస్తుంది.

## ఎన్నికలప్పుడే పొత్తు ధర్మం (మొదటి పేజీ తరువాయి)

కనీసం 5 అసెంబ్లీ స్థానాలకు తగ్గకుండా పోటీ చేయాల్సిందేనని, ఇందు కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని సాంబశివరావు అన్నారు. కేవలం ఒకటి, రెండు సీట్లతో సరిపెట్టుకుంటే పార్టీ భవిష్యత్తుకే ప్రమాదంగా పరిణమిస్తుందని, ఒక వేళ పొత్తు కుదరకపోతే 10 నుండి 15 స్థానాల్లో సిపిఐ ఒంటరిగానైనా పోటీ చేసే శక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.రాజీలేని పోరాటాల ద్వారా సిపిఐకి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు రానున్న ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లడమే లక్ష్యంగా పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.

**ప్రజల్లో అసంతృప్తిని కదిలించే శక్తి కమ్యూనిస్టులకే ఉంది**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి గూడుకట్టుకుని ఉందని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి యువతను బొద్దింకలతో పోల్చడం, దానికి ‘కాక్రోచ్ జనతా పార్టీ’ అని పేరు పెట్టగా దానికి సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి లభించిన అపూర్వ మద్దతే ప్రజలకు ప్రభుత్వాలపై ఉన్న అసంతృప్తికి నిదర్శనమన్నారు. నివురు గప్పిన నిప్పులా ఉన్న ఆ సంతృప్తి బడబాగ్నిగా మారడానికి ప్రజలు మంచి వేదిక కోసం చూస్తున్నారని, ఆ వేదిక సిపిఐ కావాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. అయితే బిఆర్‌ఎస్ కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలపై పోరాడే అసలైన శక్తి కేవలం సిపిఐకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. రైతులు, ధాన్యం సమస్యలు, ఆర్‌టిసి, కనీస వేతనాలు, సింగరేణి, పోడు భూములు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కొరత వంటి అనేక అంశాలపై పార్టీ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు.

**తెలంగాణాలో బిజెపికి తావులేదు**

మతవాదం, మతపరమైన విభజన అనే పునాది తప్ప ప్రజా సంక్షేమం పట్టని బిజెపికి దక్షిణాదిలో తావులేదని సాంబశివరావు అన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ఆయన మాట్లాడు తూ రెండు రాష్ట్రాలలో బిజెపి నిలదొక్కుకున్నప్పటి కీ, దక్షిణాది రాష్ట్రాల్లో ఆ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వడంలేదని స్పష్టం చేశారు. తెలంగాణను కూడా బిజెపి కమ్మేస్తుందని జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం నిజం లేదని, ఇక్కడ ఆ పార్టీ అధికారంలోకి రావడం ఎప్పటికీ జరగదన్నారు.

**కనీస వేతనాల పెంపుద ల పట్ల సిపిఐ హర్షం:**

ప్రభుత్వం కార్మికులకు ఇటీవల పెంచిన కనీస వేతనాలకు సంబంధించి సిపిఐ, ఎఐటియుసి సూచనల మేరకు ప్రభుత్వం కొన్ని మార్పులు చెర్పులు చేస్తూ జి.ఓ. 6ను విడుదల చేయడం పట్ల కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న 72 షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్‌లో కొన్నింటికి మాత్రమే కరువు భత్యం అమలు చేసే సౌలభ్యం ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్‌లో అందరికీ డిఏ వర్తింపజేయడంతోపాటు, మరికొన్ని ఇతర రకాల ఎంప్లాయ్‌మెంట్‌లను ప్రస్తుతం జిఓలో పొందు పరచడం, అప్రెంటీషిప్ లాంటి కార్మికులకు కూడా జిఓలో ప్రకటించిన కనీస వేతనాల్లో 75 శాతం చెల్లించాలని ప్రకటించడం కార్మికులకు ఎంతో లాభదాయకమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల కన్నా ఒక వేళ ఎక్కువ వేతనం పొందుతున్న కార్మికులకు అదనంగా 10 శాతం వేతనం ప్రకటించడం ఎఐటియుసి కృషి ఫలితమేనని పేర్కొన్నారు. పంచాయితీ కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని కోరామని, దాదాపు కోటి మందికి పై గా కార్మికులు ప్రయోజనం పొందుతారని తెలిపారు.



**పలువురికి సంతాపం**

సిపిఐ రాష్ట్ర సమితి గత సమావేశాల నుంచి ఈ సమావేశాల వరకు మరణించిన పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు నేతలు, ఇతర ప్రముఖులకు సిపిఐ రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించింది. ప్రముఖ అభ్యుదయ రచయిత డాక్టర్ ఏటుకూరి ప్రసాద్, రాష్ట్ర పార్టీ ఆడిట్ కమిషన్ సభ్యులు వి.వి.ఎస్. మూర్తి, పాల్వంచ పట్టణ మాజీ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, చంద్రుగొండ మండల సిపిఐ గిరిజన నేత కీసర రాఘవులు, భారత జాతీయ ఉద్యమ కన్వీనర్ మోటూరి కృష్ణ ప్రసాద్ (కెపి), ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు, ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ మహ్మద్ అన్సారి, ప్రముఖ గాయని ఆశా భోంస్లే, కె.గౌరమ్మ, ఏటుకూరి కనకదుర్గ, ఆరుట్ల వెంకటలక్ష్మి నరసింహారెడ్డి తదితరులకు సమావేశం నివాళులు అర్పించింది.

### ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు

సిపిఐ అత్యంత బలంగా ఉన్న 40 నియోజకవర్గాలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. ఈ నియోజకవర్గాల్లో ఆగస్టు 6 నుండి 14 వరకు పెద్ద ఎత్తున పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా 4న రౌండ్ టేబ్ సమావేశం, 10న అధిక ధరలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు,15న హైదరాబాదులో ఎస్.ఐ.ఆర్.పై (సర్) రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 28న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి తెలంగాణ నుంచి భారీ ఎత్తున తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

# మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ మార్పు

## జూన్ కాదు ఫిబ్రవరిలో!




అంతర్జాతీయ క్రికెట్ మండలి తొలిసారి నిర్వహించ తలపెట్టిన మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ తేదీ మారింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది జూన్‌లో టోర్నమెంట్ జరగాలి. కానీ, ఈ మెగా ఈవెంట్‌ను అంతకంటే ముందుగానే ఆడించాలని ఐసిసి తీర్మానించింది. 2027 ఫిబ్రవరిలో 10 జట్లతో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలని నిర్ణయించింది. ఐపీఎల్ 19వ సీజన్ ఫైనల్ అనంతరం అహ్మదాబాద్‌లో జరిగిన త్రైమాసిక సమావేశంలో ఐసిసి పెద్దలు షెడ్యూల్ మార్పునకు ఆమోదం తెలిపారు. వరల్డ్‌కప్ వంటి ఐసిసి ఈవెంట్లలో సమాన నగదు బహుమతితో మహిళా క్రికెట్ అభివృద్ధికి బాటలు వేసిన ఐసిసి ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీతో అతివల ఆటను మరో మెట్టు ఎక్కించాలనుకుంటోంది. అందులో భాగంగానే వచ్చే ఏడాది(2027) జూన్ జూలైలో టోర్నీ జరపాలని ఐసిసి భావించింది. కానీ, ఫిబ్రవరిలో ఈమెగా టోర్నీని నిర్వహించాలని నిర్ణయించింది. అహ్మదాబాద్‌లో ఆదివారం అధ్యక్షుడు జైషా నేతృత్వంలో సమావేశమైన ఐసి సభ్యులు షెడ్యూల్ మార్చాలని, ఫిబ్రవరిలో 10 జట్లతో టోర్నీ జరపాలని తీర్మానించారు. దాంతో.. 2027 ఫిబ్రవరిలో ఐదు పూర్తిస్థాయి సభ్య దేశాలు, ఐదు అసోసియేటెడ్ దేశాలు.. మొత్తం 10 జట్లు ఛాంపియన్స్‌ట్రోఫీ తొలిసీజన్లో తలపడనున్నాయి.

**జూన్ 12 నుంచి..** తొలుత 8 జట్లతో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని జరపాలని 2022లో ఐసిసి భావించింది. మహిళా క్రికెట్ సభ్య దేశాలు అందుకు అంగీకరించడంతో 2027 జూన్‌లో టోర్నీ నిర్వహించాలని అనుకున్నారు. అయితే.. న్యూజిలాండ్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఆరు మ్యాచ్లు ఆడనుంది. అదే సమయంలో జూన్ 12 నుంచి మహిళల పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది. దాంతో, ఛాంపియన్స్ ట్రోఫీని ఫిబ్రవరిలో జరపడమే సబబు అని ఐసీసీ బృందం ఆలోచన చేసింది.



## ఫ్రెంచ్ ఓపెన్‌లో దూసుకెళ్తున్న బాలాజీ

### యుకి బాంబ్రీ జోడీ ఓటమి..!

భారత డబుల్స్ ఆటగాడు ఎన్.శ్రీరామ్ బాలాజీ ఫ్రెంచ్ ఓపెన్‌లో దూసుకెళ్తున్నాడు. మార్సెలో డెమొలినర్(బ్రెజిల్)తో జోడీ కట్టిన బాలాజీ అదిరే ఆటతో క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టాడు. సోమవారం జరిగిన మూడో రౌండ్లో ఈ ద్వయం ఆరో సీడ్‌కు షాకిచ్చి ముందంజ వేసింది. జూనియర్ పోటీల పురుషుల సింగిల్స్ భారత్‌కు చెందిన ఆర్ణవ్ పపర్కర్ 16వ రౌండ్‌కు అర్హత సాధించాడు. కానీ, యుకీ బాంబ్రీ జంటకు డబుల్స్లో ఓటమి ఎదురైంది. ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్లో శ్రీరామ్ బాలాజీ జోరు చూపిస్తున్నాడు. పురుషుల డబుల్స్లో మార్సెలో డెమొలినర్తో కలిసి వరసగా మూడో విజయంతో క్వార్టర్ ఫైనల్ చేరాడు. సోమవారం ఆరో సీడ్ కెవిన్ క్రవిట్జ్ టిమ్ పుయెట్జ్ జంటను చిత్తు చేసింది బాలాజీ మార్సెలో జోడీ. తొలి సెట్ నుంచి ఆధిపత్యం చెలాయించి 7–5, 6–4తో వరస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించి క్వార్టర్స్ చేరింది బాలాజీ మార్సెలో జోడీ. మరో మ్యాచ్లో యుకీ బాంబ్రీ మైఖేల్ వీనస్(న్యూజిలాండ్) ద్వయం అనూహ్యంగా కంగుతిన్నది. ఇటలీ జంట సామొనె బొలెల్లీ అండ్రీయ వవస్సోరి చేతిలో 3–6, 4–6తో ఓటమి పాలైంది.

## ఆర్‌సిబి స్టార్‌కు భారీ జరిమానా



ఐపీఎల్ చరిత్రలో వరసగా రెండో సారి ట్రోఫీ గెలిచిన మూడో జట్టుగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బిగ్ షాక్. అదిరే విజయంతో విక్టరీ సంబురాల్లో మునిగి పోయిన ఆ జట్టులోని విదేశీ ఆటగాడు టిమ్ డేవిడ్‌పై వేటు పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించిన అతడు వచ్చే సీజన్ తొలి మ్యాచ్ ఆడకుండా నిషేధానికి గురయ్యాడు. లెవల్ 1 తప్పిదానికి పాల్పడిని డేవిడ్కు మ్యాచ్ ఫీజులో ఏకంగా 50 శాతం కోతతో పాటు.. రెండు డీమెరిట్ పాయింట్లు కేటాయించారు. అహ్మదాబాద్లో గుజరాత్ టైటాన్స్తో ఆదివారం(మే 31) జరిగిన ఫైనల్లో టిమ్ డేవిడ్ ఐపీఎల్ కోడ్ను ఉల్లంఘించాడు. గుజరాత్ ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్లో అతడు ఐస్ ప్యాక్ను కోపంగా అంపైర్ నితిన్ మీనన్ వైపు విసిరాడు. ఆర్సీబీ స్టార్ తీరును తప్పుబట్టిన మ్యాచ్ రిఫరీ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాడు. ఆర్టికల్ 2.9 ప్రకారం క్రికెట్ వస్తువులను దెబ్బతీయడం.. మ్యాచ్ అధికారి, అంపైర్, రిఫరీలను గాయపరిచేలా ప్రవర్తించడం వంటి వాటిని నేరంగా పరిగణిస్తారు. ఇన్నింగ్స్ మధ్యలో డేవిడ్ కోపంగా అంపైర్ నితిన్ వైపు ఐస్ ప్యాక్ విసరడం కూడా ఆర్టికల్ 2.9 కిందకే వస్తుంది. దాంతో.. అతడికి మ్యాచ్ ఫీజులో సగం కోత విధించారు. ముంబై ఇండియన్స్తో మ్యాచ్లో అభ్యంతరమైన సంజ్ఞలతో ఒకటి, 54వ మ్యాచ్లో రెండు డీమెరిట్ పాయింట్లకు తోడు.. తాజా నేరానికి మరో రెండు కలిపి మొత్తం.. ఐదు డీమెరిట్ పాయింట్లు అయ్యాయి. ఫలితంగా.. 20వ సీజన్లో ఆర్సీబీ తొలి మ్యాచ్లో ఆడడానికి టిమ్ డేవిడ్ను అనర్హుడిగా ప్రకటించారు.

## యువతరంగం

# ఇ–స్పోర్ట్స్‌లో ఉజ్వల కెరీర్



ఇ–స్పోర్ట్స్‌లో కెరీర్ నిర్మాణం.. ఒకప్పుడు ఆటలు ఆడడం మానేసి పనికొచ్చేదేదైనా చేయమని తల్లిదండ్రులు చెప్పిన మాటలు చాలా మందికి పరిచయమే. కానీ ఇప్పుడు ఆ ఆలోచన కాలం చెల్లింది. ఇస్పోర్ట్స్ భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న పరిశ్రమగా మారింది. ఇది కేవలం వినోదం కాదు... కోట్ల రూపాయల పెట్టుబడులు, స్పాన్సర్‌షిప్‌లు, ఉద్యోగాలు సృష్టిస్తున్న రంగం. 'యూత్ ఇన్‌కార్పొరేటెడ్' ప్రకారం, 2028 నాటికి సుమారు 1.4 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. టోర్నమెంట్ బహుమతులే రూ.100 కోట్లకు చేరతాయని మార్కెట్ నిపుణులు అంటున్నారు. అయితే ఇస్పోర్ట్స్ రంగంలో పనిచేసే వారిలో ఎక్కువ మంది ప్రత్యక్షంగా ఆటలో పాల్గొనరు. కోచ్‌లు, మేనేజర్లు, విశ్లేషకులు, కంటెంట్ సృష్టికర్తలు, ఈవెంట్ నిర్వాహకులు, డెవలపర్లు, మార్కెటింగ్ నిపుణులు వంటి ఎంతో మంది ఈ పరిశ్రమకు కీలకం. ఇస్పోర్ట్స్ అనేది క్రీడల మాదిరిగానే పోటీ పద్ధతిలో జరిగే వీడియో గేమింగ్. వ్యక్తులు లేదా జట్లు నిర్వహిత టోర్నమెంట్లలో పాల్గొని, లక్షలాది మంది ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షిస్తారు. మైదానంలో ఆడే క్రికెట్, ఫుట్‌బాల్‌లకు ఇది డిజిటల్ రూపం అనుకోవచ్చు. భారతదేశంలో బిజిఎంఐ, వారొటాంట్, ఫిఫా, ఫ్రీ ఫైర్ మాక్స్ వంటి ఆటలు విస్తృతంగా ప్రాచుర్యంలో ఉన్నాయి. దాదాపు 60 కోట్ల మంది ఆన్‌లైన్ గేమర్లు ఉన్నారని ఇస్పోర్ట్స్ గణాంకాలు చెప్తున్నాయి. ప్రేక్షకులు పెరిగితే, స్పాన్సర్లు వస్తారు... స్పాన్సర్లు వస్తే.. ఉద్యోగాలు ఏర్పడతాయి. ఇస్పోర్ట్స్‌లో ఆదాయం విషయానికి వస్తే, అది మీరు చేసే పనిపై, మీ నైపుణ్యంపై పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ప్రొఫెషనల్ ప్లేయర్లకు ప్రారంభ దశలో నెలకు సుమారు రూ.40,000 నుంచి రూ.75,000 వరకు రావచ్చు. ఇది జట్టు జీతం, చిన్న టోర్నమెంట్ గెలుపులు, అప్పుడప్పుడూ వచ్చే బ్రాండ్ డీల్స్ కలిపిన మొత్తం. పేరు సంపాదించిన ఆటగాళ్లు నెలకు రూ.5 నుంచి 15 లక్షల వరకు కూడా సంపాదించగలరు. అంతర్జాతీయ స్థాయిలో ఆడి, స్ట్రీమింగ్ చేస్తే వార్షికంగా రూ.70–85 లక్షల వరకు వచ్చే అవకాశముంది. కానీ, ఇవి కొన్ని మినహాయింపులు మాత్రమే. నిజానికి చాలామంది ఆటగాళ్లు నెలకు రూ.50,000 దాటడం లేదన్నది వాస్తవం. అంటే, ఎంతగా నైపుణ్యాన్ని పెంచుకుంటే, అంతగా సంపాదించుకునే అవకాశం ఉంటుంది. ఆటగాళ్లకే కాకుండా ఇతర పాత్రల్లో స్థిరమైన ఆదాయం ఉంటుంది. కోచ్‌లు సంవత్సరానికి రూ.6–8 లక్షలు, గేమ్ డెవలపర్లు రూ.5–7 లక్షలు, ఇస్పోర్ట్స్ మేనేజర్లు రూ.4–6 లక్షలు సంపాదించగలరు. ఈ ఉద్యోగాలు టోర్నమెంట్ల గెలుపుపై ఆధారపడవు కాబట్టి భద్రమైనవిగా భావించవచ్చు. ఒకవేళ ఆటగాడిగా మారాలంటే, అది సరదా ఆట కంటే ఎక్కువ. రోజూ గంటల కొద్దీ సాధన, క్రమశిక్షణ, మానసిక స్థైర్యం అవసరం. ఒకేసారి అనేక గేమ్స్‌పై కాకుండా, ఒక గేమ్‌ను ఎంచుకుని దానిలో నైపుణ్యం సాధించాలి. జట్లు కేవలం టాలెంట్‌నే కాదు... జట్టు సమన్వయం, స్పష్టమైన కమ్యూనికేషన్, ఒత్తిడిలోనూ నిలబడగల సామర్థ్యం, గేమ్ అప్‌డేట్లను అనుసరించే ధోరణి వంటి అంశాలను చూస్తాయి. సాధారణంగా ఆటగాళ్లు చిన్న ఆన్‌లైన్ టోర్నమెంట్లతో మొదలుపెట్టి, క్రమంగా గుర్తింపు సంపాదించి, సెమీప్రొఫెషనల్ జట్లకు చేరుతారు. ఇస్పోర్ట్స్‌లో చాలామంది గమనించని ఉద్యోగాలు కూడా ఉన్నాయి. కోచ్‌లు, అనలిస్టులు గేమ్‌ను లోతుగా విశ్లేషించి ఆటగాళ్లను మెరుగుపరుస్తారు. స్ట్రీమర్లు, కాస్టర్లు టోర్నమెంట్లను వ్యాఖ్యానం చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. ఈవెంట్స్, ఆపరేషన్స్ విభాగంలో లాజిస్టిక్స్, ప్రొడక్షన్, షెడ్యూలింగ్ చూసే వారు ఉంటారు. గేమ్ డెవలప్‌మెంట్‌లో టెస్టర్లు, డిజైనర్లు, మార్కెటర్లు అవసరం. స్పాన్సర్‌షిప్, మార్కెటింగ్ విభాగం బ్రాండ్లు–జట్ల మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. ఈ నైపుణ్యాలన్నీ నేర్చుకోవడానికి తప్పనిసరిగా సంప్రదాయ డిగ్రీ అవసరం లేదు. కానీ శిక్షణ అవసరం. భారతదేశంలో కొన్ని ఇస్పోర్ట్స్ అకాడమీలు, మేనేజ్‌మెంట్, బ్రాడ్‌కాస్టింగ్, గేమ్ డిజైన్ కోర్సులు అందిస్తున్నాయి. అలాగే, ప్రొఫెషనల్ మ్యాచ్‌లు చూడడం, మీ ఆటను విశ్లేషించుకోవడం, ఆన్‌లైన్ కమ్యూనిటీల్లో పాల్గొనడం ద్వారా స్వయంగా నేర్చుకోవడం కూడా సాధ్యమే. ప్రస్తుతం దేశంలో ఇస్పోర్ట్స్ ఉద్యోగాలు పరిమితంగానే ఉన్నా, వేగంగా పెరుగుతున్నాయి. బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫ్రీలాన్స్ పనులు కూడా ఉంటాయి. చదువు లేదా ఉద్యోగాన్ని కొనసాగిస్తూ, వీలైన సమయంలో పోటీలు, స్ట్రీమింగ్, కోర్సులు చేయడం సురక్షిత మార్గం. భారతదేశంలో ఇస్పోర్ట్స్ ఇక రోజంతా ఆటలే అనే భావన కాదు. ఇది క్రమశిక్షణ, ప్రణాళిక, నైపుణ్యాలతో కూడిన గంభీరమైన రంగం.

## అతడికి ప్రకృతి వినిపిస్తుంది




అందరికీ ప్రకృతి కనిపిస్తుంది... కానీ, అతడికి మాత్రం ప్రకృతి కనిపిస్తుంది. తోటి పిల్లలంతా బయట ఆడుకుంటూ ఉండగా, చిన్న టామ్ మాత్రం వేరే ప్రపంచంలో జీవించేవాడు. అతని ప్రపంచం శబ్దాలది. ఆకులపై పడే వానబిందువుల మృదుస్వరాలు, గాలి చెట్ల మధ్య దూసుకెళ్తూ చేసే మర్మరాలు, నేలపై అడుగుల ప్రతిధ్వనులు.. ఇలాంటివన్నీ మిగతా వారికి సాధారణ శబ్దాలు కావచ్చు... కానీ, టామ్‌కు అవి సంగీత ధ్వనులు. అతను గంటల తరబడి నిశ్శబ్దంగా కూర్చుని వినేవాడు. వినడం అతని ఆట, అతని విద్య. ఈ బాలుడే తరువాత ప్రపంచానికి బ్లైండ్ టామ్‌గా పరిచయమైన థామస్ విగ్గిన్స్. నాలుగేళ్ల వయస్సులో ఒక గదిలో ఉన్న పియానోను తాకినప్పుడు, అతనికి ఎవరూ రాగాలు నేర్పలేదు. అయినా కీలు నొక్కిన కొద్దిసేపటికే వినిపించిన స్వరాలను పక్కా గుర్తించి మళ్లీ వాయించాడు. ఒకసారి విన్న మెలోడీ అతని జ్ఞాపకంలో చెరిగిపోయేదికాదు. అతని యజమాని జేమ్స్ నీల్ బెథునే ఈ ప్రతిభను గమనించాడు. సంగీత ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి, టామ్ ప్రదర్శనలను అమెరికా, యూరోప్ అంతటా నిర్వహించాడు. ప్రేక్షకుల ముందర లుడ్విగ్ వాన్ బీథోవెన్ వంటి మహానుభావుల కృతులను ఒక్కసారి విన్న వెంటనే టామ్ అలాగే వాయించేవాడు. అంతేకాదు, పియానోపై వర్షం, మెరుపు, గాలి శబ్దాలను సృష్టించి ప్రజలను విస్మయానికి గురిచేసేవాడు. కానీ, లభించిన కీర్తి, సంపాదించిన సంపద టామ్‌కు చేరేదికాదు. టామ్‌కు తన జీవితం మీద నియంత్రణ ఏమాత్రం లేదు. అన్నీ అతని యజమాని బెథునే చూసుకునేవాడు. ప్రెసిడెంట్లు, రాజ్యాధినేతల ముందర ప్రదర్శించినప్పటికీ, వ్యక్తిగత స్వాతంత్ర్యం అతనికి దక్కలేదు. 1908లో అతను మరణించాడు. కాలక్రమేణా ప్రపంచం అతన్ని మరచిపోయింది. కానీ అతని రికార్డులు ఇంకా మిగిలే ఉన్నాయి. సంగీత శాస్త్రవేత్తలు అతని వినికిడి సామర్థ్యాన్ని అధ్యయనం చేస్తున్నారు. అతను సూర్యాస్తమయం చూడలేదు. పుస్తకాలు చదవలేదు. స్వేచ్ఛను పూర్తిగా అనుభవించలేదు. అయినప్పటికీ అతను ప్రపంచాన్ని, మనం సాధారణంగా గమనించని సూక్ష్మ స్వరాల రూపంలో తన చెవుల ద్వారా విన్నాడు.

# ఆర్‌టిసి విలీన 'అపాయింట్ డే' ప్రకటించాలి

### టిజెఎంయు అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల ప్రభుత్వ విలీనానికి సంబంధించి 'అపాయింట్ డే'ను తక్షణమే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టిజెఎంయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తదుపరి కార్యాచరణను ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో సోమవారం టిజెఎంయు ఆధ్వర్యంలో ఆర్‌టిసి విలీన అపాయింట్ డే వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మహా దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్‌టిసి యూనియన్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు సమావేశమై ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదన్నారు. దీంతో ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు ఈ అంశాన్ని పునః సమీక్షించి విలీన ప్రక్రియకు సంబంధించి అపాయింట్ డే ప్రకటించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులకు న్యాయం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు తమలో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని, ఆ ఆశలను నిరాశపరచవద్దని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. నల్లగొండ రీజియన్ కార్యదర్శి తవిటి మురళి ముదిరాజ్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో 56 రోజుల ఉద్యమంలో 36 మంది ప్రాణత్యాగం చేశారన్నారు. ఆర్‌టిసి కార్మికులకు అన్యాయం చేసిన కెసిఆర్‌ను ఎన్నికల్లో ఓడించి, తగిన గుణపాఠం చెప్పామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీనిచ్చిందని, ఇచ్చిన హామీని సిఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తారనే విశ్వసం ఆర్‌టిసి కార్మికుల్లో ఉందన్నారు. ప్రభుత్వం జూన్ 2న విలీన ప్రక్రియను ప్రారంభించి, కార్మికులకు న్యాయంచేయాలని మురళి కోరారు. ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజిరెడ్డి, సాములయ్య, గోలి రవీందర్, ప్రేమ్నాథ్, సంపత్ కుమార్, అతిక్, కృష్ణ, పాండు, చెన్నయ్య, సాయిరెడ్డి, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు ఐక్యంగా ఉండాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అన్నిరంగాల్లో పనిచేసే కార్మికులందరూ ఐక్యం కావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మండల పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. వివిధ రంగాలలో పనిచేసే కార్మికులు ఐక్యం గా ఉండటం ద్వారా తమ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న జిప్లస్ వన్ ఇళ్లలో నిరుపేదలైన పెయింటింగ్ కార్మికులకు ఇవ్వాలని అధికారులను కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం పట్టణ అధ్యక్షులు జక్కుల రమేష్, తమ్మిశెట్టి రవి, సింగం నాగరాజు, కాకి సురేష్, గాజనబోయిన రాము, ఆవుల నాగేశ్వరరావు, ప్రశాంత్, నరేష్, ఉపేంద్రచారి, తురక అంజయ్య, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

### ఎఐటియుసి జాతీయ కౌన్సిల్ పిలుపు



**త్రిసూర్(కేరళ) :** కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మా తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి మూడో తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జరుగుతున్న ఎఐటియుసి జాతీయ కౌన్సిల్ సమావేశాలలో కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలపై ఎజెండాలో చేర్చి పోరాట కార్యక్రమం రూపొందిస్తున్నట్లు వారు వెల్లడించారు. దేశంలో కార్మిక వర్గం తీవ్ర సంక్షోభంలో ఉన్నదని, కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల వలన కార్మిక వర్గం మరొకసారి బానిసత్వంలోకి వెళ్లే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల వరకు పనిచేయవచ్చు అని లేబర్ కోడ్‌లలో పొందుపరచడం జరిగిందని, కార్మిక చట్టాలను రద్దుచేసి కోడ్‌లను తీసుకురావటం కార్మికులకు తీవ్ర అన్యాయమన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26,000 ఇచ్చేవరకు, కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకొని హక్కు సమ్మె చేసే హక్కు పునరుద్ధరించేంతవరకు పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు. కార్మిక చట్టాలు రద్దు చేయడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘమైన ఎఐటియుసి 43వ జాతీయ మహాసభలు నవంబర్ 22 నుంచి 26 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరగనున్నాయని, ఈ మహాసభలకు ముందు అన్నిరాష్ట్రాలలో మహాసభలను నిర్వహించి కార్మిక వర్గాన్ని చైతన్య పరిస్థితి పోరాట కార్యక్రమాన్ని రూపొందించి కార్మికుల పక్షాన పోరాడేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్నఅనేక అంశాలపై, పిఎఫ్ సీలింగ్ ఎత్తివేయాలని, ఇఎస్ఐ సీలింగ్ ఎత్తివేయాలని, నూతన పెన్షన్స్ స్కీమును రద్దుచేసి పాతపెన్షన్ స్కీములు పునరుద్ధరించాలని, దక్షిణాసియాలో శాంతిని పునరుద్ధరించాలని, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్‌లో ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా, మహిళా రిజర్వేషన్ బిల్లులో బిజెపి ద్వంద్వ నీతిని ఎండగట్టాలని, ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్‌కు వ్యతిరేకంగా, సర్‌తో భారత ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపైన, బిబి రామ్ జి నీ రద్దుచేసి ఉపాధి హామీని పునరుద్ధరించాలని, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని తదితర అంశాలపై మహాసభలలో చర్చించి నిర్ణయాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి ఉపాధ్యక్షులు పి.ప్రేమ్‌పావని, కె.యేసురత్నం, రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, టేకులపల్లి సమ్మయ్య, నారాటి ప్రసాద్, వై.ఓమయ్య, ఓరుగంటి యాదయ్య, ఎస్.విలాస్, సింగు నరసింహారావు, కార్యవర్గ సభ్యులు బి.జి.క్లెమెంట్, రవిచంద్ర, హసీనా బేగం, సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాస్, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

# ఏటుకూరి ప్రసాద్‌కు సిపిఐ రాష్ట్ర సమితి ఘననివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాహితీ రంగంలో సంపూర్ణ వ్యక్తిత్వం సంపాదించుకున్న మహనీయుడు ఏటుకూరి ప్రసాద్ అని పలువురు సిపిఐ నేతలు కొనియాడారు. ఏటుకూరి ప్రసాద్ మరణం మార్క్సిస్టు సాహిత్యరంగానికి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర సమితి ఘనంగా నివాళులు అర్పించింది. ప్రముఖ సాహితీవేత్త, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ సంస్మరణ సభ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగింది. సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయకార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈ.టి.నరసింహా, సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, భాగం హేమంతరావు, వి.ఎస్.బోస్, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహాతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏటుకూరి ప్రసాద్ చిత్రపటానికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంతో జీవితాన్ని పెనవేసుకున్న గొప్ప మార్క్సిస్టు తత్వవేత్త ఏటుకూరి ప్రసాద్ అన్నారు. కవులు, రచయితలకు సహజంగానే కొంత గర్వం, ఆహంభావం ఉంటుందని, కానీ ఏటుకూరి ప్రసాద్‌లో అది కించెత్తు కూడా ఉండేది కాదని, ఆయన నిగర్వి అని అన్నారు. ఎంతో సమయస్ఫూర్తి గల వ్యక్తి అని అందరితో సరదాగా ఉండేవారని, అదే సమయంలో తాను చెప్పాలనుకున్న అంశాలను స్పష్టంగా చెప్పేవారని డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ఆరసం నిర్మాణంలో ఏటుకూరి ప్రసాద్ కీలక పాత్ర పోషించారన్నారు. రచనలలో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ సొంత పేరు, ప్రతిష్టలకు పాకులాడకుండా సంఘంపై ఎక్కువ దృష్టి సారించడంతో ఆయనకు రావాల్సినంత పేరు రాలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వామపక్ష భావజాలం గల ఆ కుటుంబం సమాజాభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. ఏటుకూరి ప్రసాద్ మేధోరంగంలో ఎనలేని కృషి చేశారని ఘనంగా నివాళ్లు అర్పించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ సాహిత్యరంగానికి నిస్వార్థంగా ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. ప్రసాద్ రాసిన పాటలతో పాటు ఆయన జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురానున్నామని, అదే ఆయనకు మనమందించే ఘన నివాళి అని పేర్కొన్నారు.



# నదీ జలాల విడుదలపై ఎగువ రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవాలి

* అంతరాష్ట్ర జలాలను ప్రొరేటా ప్రకారం డ్యామ్‌ల వారీగా విడుదలకు చర్చించాలి
* వర్షాకాలంలోపు డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలి
* పంట మార్పిడి.. పంటల వైవిధ్యతపై రైతులకు అవగాహన కల్పించాలి

**వర్షాకాల సన్నద్ధత సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని వాతావారణ శాఖ నివేదిస్తున్నందున కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా జలాలు దక్కేలా చూడాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్‌లు నిండిన తర్వాతే నీళ్లు వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని సిఎం పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా ఉన్నందున అంతరాష్ట్ర జలాల్లో ప్రొరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సిన వాటా జలాలు వచ్చేలా వివిధ రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని సిఎం నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

వివిధ శాఖల వర్షాకాల సన్నద్ధతపై డాక్టర్ బిఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జల విద్యుత్ ఉత్పత్తికే మహారాష్ట్ర వినియోగిస్తోందని, ఆ మొత్తం నీటిని మనం తీసుకుని వారికి అవసరమైన విద్యుత్ మనం సరఫరా చేసే దానిపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని సిఎస్ రామకృష్ణారావును సిఎం ఆదేశించారు. గోదావరి నది నుంచి ఏటా వేల టిఎంసిల జలాలు సముద్రం పాలవుతున్నాయని, అయితే ఆ వరదంతా చాలా స్వల్పకాలంలోనే వస్తోందని సిఎం అన్నారు. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సిఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన సీలేరు, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో తెలంగాణ కు రావాల్సిన వాటాపై నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

**డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి**

రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సిఎం ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై సిఎం ఎ.రేవంత్ రెడ్డి అధికారులతో ఆరా తీశారు. గతంలో కడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను సిఎం గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌కు సంబంధించి ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు సిఎంకు తెలియజేశారు. ఎన్ని నిధులు అవసరమైనా వెంటనే విడుదల చేయాలని సిఎం ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

**వాతావరణ శాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా పంటల సాగు**

వాతావరణ శాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను సిఎం ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల నుంచి అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని సిఎం తెలిపారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సిఎం తెలిపారు.

**వరదల సమయంలో దెబ్బతిన్న వాటికి రూ.1000కోట్లతో మరమ్మతులు**

గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తాను క్షేత్ర స్థాయిలో పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీల అమలుపై అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరదల సమయంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం, ఇతర పనులకు విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000 కోట్లను నిబంధనల ప్రకారం వ్యయం చేయాలని సిఎం సూచించారు. నాడు ఇచ్చిన హామీలు, వాటి ప్రస్తుత పరిస్థితి, ఏవైనా నెరవేరకుంటే అందుకు కారణాలతో తనకు నివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. హామీల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వడగాలులు, వరదల సమయంలో ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడు వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు.

**రోడ్లపై వరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. నీరు నిలిచే 141 ప్రదేశాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని గతంలో నిర్ణయించామని, వాటి పురోగతిపై సిఎం అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే 11 వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పూర్తి చేశామని, మిగతా వాటి పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీనియర్ అధికారి జయేశ్ రంజన్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలో సమస్యల పరిష్కారానికి మూడు నగరాల పోలీస్ కమిషనర్లు సమన్వయంతో ముందుకు సాగాలని సిఎం సూచించారు.

**తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక**

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతాలోనూ తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు సిఎం కు తెలియజేశారు.

పరిస్థితికి తగినట్లు తాగు నీరు, విద్యుత్ ఉత్పత్తి, సాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులు చేయాలని సిఎం అధికారులను ఆదేశించా రు. విద్యుత్ శాఖ వర్షాకాలానికి అవసరమైన సామగ్రిని ముందుగానే సమీకరించుకోవాలని సిఎం సూచించారు. గాలిదుమ్ములు, భారీ వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నప్పుడు, లైన్లు తెగిపోయి సరఫరా నిలిచినప్పుడు తక్షణమే స్పందించి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు.

# చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

## రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



తిరుమలగిరి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి, అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500బోనస్ అందిస్తూ మద్దతు ధరకు కొనుగోలు చేపడుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 354 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జిల్లాలో 71 రైస్ మిల్లులను కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేయగా, మరో 22 మిల్లులను అదనంగా ధాన్యం సేకరణకు సిద్ధం చేసినట్లు వివరించారు. బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కూలీల కొరత ఏర్పడటంతో ధాన్యం ఎగుమతులు, దిగుమతుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. అయినప్పటికి రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. లారీల కొరతను అధిగమించేందుకు పోలీసు శాఖ సహకారంతో ఇసుక, సిమెంట్ ఇతర అవసరాలకు వినియోగిస్తున్న లారీలను ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది కలగకుండా రవాణాకు మళ్లించినట్లు పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో కొనుగోలు చేసిన 48 నుండి 72 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు. భారతదేశంలో యాసంగి వరి ధాన్యంలో 63 శాతం తెలంగాణ నుంచే సరఫరా అవుతోందని, వరి ఉత్పత్తి, కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని జూన్ 4 నాటికి పూర్తిగా తరలించి కొనుగోలు ప్రకియను ముగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమలో రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, డిఎస్‌ఒ మోహన్ బాబు, ఆర్‌డిఒ వేణుమాధవరావు, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపిడిఓ లాజర్, ఎపిఎం లక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ వై చామంతి నరేష్, పిఎసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి**

**అర్వపల్లి (నాగారం) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా ముగించాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నాగారం మండలం ఫణిగిరి ఐకెపి సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సెంటర్‌లో మొత్తం 1571 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, ఇందులో ఇప్పటి వరకు 1488 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. మిగిలిన ధాన్యాన్ని రెండు, మూడు రోజుల్లో పూర్తిచేస్తామని మండల ఏపిఎం వెంకట్ రెడ్డి మంత్రికి వివరించారు.

తదుపరి మంత్రి మాట్లాడుతూ నాగారం మండలంలోని మహిళలకు మహిళాశక్తి పథకం కింద పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్‌టిసికి అద్దె ప్రాతిపదికన బస్సులు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. మండలంలోని గ్రామ పంచాయితీలో మహిళా శక్తి భవనాలు కట్టించడం జరుగుతుందని మహిళలను కోటీశ్వరులుగా చేయటమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, డిఎస్‌ఓ మోహన్‌బాబు, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మండల ఎపిఎం వెంకట్ రెడ్డి, ఐకెపి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నా రు.

# రాజకీయ నాయకులే తెలంగాణ అస్తిత్వంపైన దాడి : కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ ఎటువంటి విబేధాలు లేకుండా కలిసే ఉన్నారని, కానీ రాజకీయ నాయకులే తెలంగాణ అస్తిత్వంపైన దాడిచేస్తూ, పెత్తనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలు,ఉద్యమకారుల పోరాటం ఫలితంగా ఏర్పడిన తెలంగాణపై ఆంధ్రానాయకుల పెత్తనాన్ని సహించబోమన్నారు. 'ఉద్యమకారుల ఆకాంక్షలు–సాధన' అనే అంశంపైన హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ టిఆర్ఎస్ అధికారంలోకి రాగానే తెలంగాణలో ఉన్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను ఆంధ్రాకు పార్సిల్ చేస్తామన్నారు. తెలంగాణలో ఆంధ్రా నాయకుల విగ్రహాల ఏర్పాటు తెలంగాణ అస్తిత్వంపైన దాడిచేయడమేనన్నారు. పి.వి.ప్రొఫెసర్ జయశంకర్ సహా తెలంగాణ అమరవీరుల విగ్రహాలను కూడా ఎపిలో పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ మేధావులు ప్రొఫెసర్ నాగేశ్వర్, పాశం యాదగిరి లాంటి వాళ్లు విశ్లేషణలు చేస్తే, ఆంధ్రా పోలీసులు ఇక్కడకు వచ్చి అరెస్ట్ చేస్తామనే ధైర్యం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఆంధ్రా ప్రజలతో తమకు ఎలాంటి ఇబ్బందీలేదని, కానీ ఆంధ్రా రాజకీయ నాయకులతోనే సమస్య ఉందన్నారు. తెలంగాణలో నవ నిర్మాణ్ పేరుతో పవన్ కళ్యాణ్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామనడాన్ని అభ్యంతరం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 11 రోజులు పస్తులుండి బాధపడిన వ్యక్తికి తెలంగాణ రాష్ట్రంపైన ప్రేమ ఎలా ఉంటుందని కవిత ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో టిడిపిని విస్తరించేందుకు తెలంగాణ ఇదేం 'మీ' సామ్రాజ్యం కాదని ఎపి మంత్రి లోకేష్‌కు సూచించారు. టిడిపి,జనసేన,వైసిపి నాయకులు తెలంగాణ నీటి జలాలను దోచుకు ందామని చూశారని, కానీ సమానంగా పంచుకుందాని ఏనాడైన అన్నారా? అని కవిత నిలదీశారు.




# ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమా ర్క మల్లు ఢిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఇటీవల జార్ఖండ్ పర్యటనకు వెళ్లిన భట్టి విక్రమార్క ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాల ను ఖర్గే కు వివరించారు. జార్ఖండ్‌లో త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో జరిపిన చర్చల వివరాలను, ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ఐక్యతను చాటే విధంగా జార్ఖండ్ కాంగ్రెస్ నేతలు శ్రమిస్తున్న తీరును కూడా ఖర్గేకు వివరించారు.

**కెసి వేణుగోపాల్‌ను కలిసిన భట్టి విక్రమార్క**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జార్ఖండ్ పర్యటనలో జరిగిన రాజకీయ పరిణామాలు, అక్కడి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశాల వివరాలను భట్టి విక్రమార్క కెసి వేణుగోపాల్‌కు వివరించారు.
























## 632 మంది పోలీసులకు విశిష్ట సేవా పురస్కారాలు




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన 632 మంది అధికారులకు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట సేవా పురస్కారాలు ప్రదానం చేయనుంది. వీరిలో పది మందికి శౌర్య పతకం, 16 మందికి మహోన్నత పతకం, 94 మందికి ఉత్తమ సేవా పతకం, 50 మందికి కఠిన సేవా పతకం, 461 మందికి సేవా పతకం, ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీసు పతకంకు ఈ సారి జెన్‌కోలో అదనపు ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న డి.ప్రతాప్ ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారు, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజాసేవలో ప్రత్యేక కృషి చేసిన పోలీసు అధికారులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందజేయనున్నట్లు సమాచారం. పోలీసు శాఖలో ఉత్తమ సేవలను ప్రోత్సహించడం, సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని పెంపొందించడం లక్ష్యంగా ప్రతి ఏడాది తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రదానం చేస్తుంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరేడ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## టాలెంట్ హంట్‌తో కాంగ్రెస్‌లో కొత్త ఒరవడి

మహేష్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధుల నియామకంలో కొత్త విధానానికి శ్రీకారం చుట్టిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన 'టాలెంట్ హంట్' కార్యక్రమం ద్వారా జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై అవగాహనతో పాటు లౌకికవాద భావజాలంపై పట్టున్న ప్రతిభావంతులను గుర్తించి అవకాశాలు కల్పిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. పార్టీలకు అతీతంగా సమాజసేవ చేయాలనే దృక్పథం కలిగిన వ్యక్తులను ఎంపిక చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశంలో సామ రామ్మోహన్ రెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్, శరన్ పటేల్, అల్లం భాస్కర్, లింగం యాదవ్, ఇందిరా శోభన్‌లతో మాట్లాడారు.

## బిఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణతో రక్తబంధం తెగిపోయింది

మెట్టు సాయికుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణతో రక్తబంధం తెగిపోయింది కాబట్టే బిఆర్‌ఎస్ నేతలు సిఎం రేవంత్‌రెడ్డి జపం చేస్తూ పునీతులు అవుతున్నారని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిజాలు మాట్లాడితే బిఆర్‌ఎస్ నాయకులకు పక్షవాతం వచ్చే రోగం ఉందని, అందుకే అబద్ధాలలో హరీష్‌రావు, కెటిఆర్ పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాలు బూతులు మాట్లాడి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. కెటిఆర్ అంటే కోతల రామరావు అని, చూడటానికి 2 వేల నోటు లాగా దగదగలాడిన అది ప్రస్తుతం చెల్లదని చమత్కరించారు. పది సంవత్సరాలు కెటిఆర్ షాడో ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తే, హరీష్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేశాడని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నేతలను రాష్ట్ర ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని, కెటిఆర్ ఎన్ని కోతలు కోసినా, సోషల్ మీడియాలో ఎన్ని రాతలు రాసినా అధికారంలోకి రాలేరని, 2034వరకు సిఎంగా రేవంత్ రెడ్డి ఉంటారని చెప్పారు. రైతులను, దళితులను, మల్లన్నసాగర్ బాధితులను హింసపెట్టింది కెటిఆర్, హరీష్ కాదా? అని మెట్టు సాయికుమార్ ప్రశ్నించారు.

### తెలంగాణ దేవాలయాల్లో సన్నాయి కుల వాయిద్య కళాకారులకు అన్యాయం

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల శ్రీనివాస్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలోని దేవాలయాల్లో వాయిద్య కళాకారుల ఉద్యోగాల భర్తీలో తెలంగాణకు చెందిన సొన్నాయి కుల వాయిద్య కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాయిద్య కళాకారులకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వడం దుర్మార్గమని తెలంగాణ సొన్నాయి కుల వాయిద్య కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోమండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వకుండా కాళేశ్వరం తదితర దేవాలయాలలో వాయిద్య కళాకారుల నియామకానికి ఇచ్చిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేయడంతో పాటు కొండగట్టు గుడి ఏర్పాటు నుంచి ఇప్పటివరకు పనిచేస్తున్న వాయిద్య కళాకారులను కాకుండా ఇతర కళాకారుల నియామకాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ సన్నాయి కుల వాయిద్య కారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం అబిడ్స్, బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు సన్నాయి వాయిద్యాలతో వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తెలంగాణలోని దేవాలయాల్లో తమ కులస్థులకు జరుగుతున్న అన్యాయం, అధికారుల వైఖరిని నిరసిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ డి.కృష్ణ ప్రసాద్ వినతి పత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం నేతలు కోమండ్ల మహేందర్, మహాదేవుని శంకర్, దేవుని చంద్రమౌళి, మెట్టుపల్లి గంగారాం, సుధీర్, మధుకర్, రవి కోరుట్ల, సిద్ధి రమేష్, కొమాండ్ల సత్యనారాయణ, కొండగట్టు అనిల్, రవి రాష్ట్ర వ్యాప్తంగా సన్నాయి కుల వాయిద్య కళాకారులు సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం


రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యాచరణను మరింత బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన రాష్ట్ర అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా మరింత పటిష్ఠం చేయడం, త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో వ్యూహాలు రూపొందించడం, తెలంగాణలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ, కర్ణాటకలో బిజెపి ప్రభుత్వాల ఏర్పాటు దిశగా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఢిల్లీలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ హాజరవుతారని చెప్పారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు, ఫ్లెక్సీలతో బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన.. కుటుంబ సభ్యులందరికీ నాణ్యమైన వైద్యసేవలు

ఇహెచ్‌ఎస్ అమలుకు రెండు రోజుల్లో ఒక ప్రత్యేక 'ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్' ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను (ఇహెచ్‌ఎస్) అమలు చేసేందుకు రెండు రోజుల్లో ఒక ప్రత్యేక 'ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు వెల్లడించారు. వివిధ ఉద్యోగ సంఘాల సూచనలు, సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే 'ట్రస్ట్' ఏర్పాటు, దాని పనితీరుకు సంబంధించిన కార్యాచరణ మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రామకృష్ణారావు అధ్యక్షతన సోమవారం 'జాయింట్ స్టాఫ్ కౌన్సిల్' సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపాదిత హెల్త్ ట్రస్ట్ అనేది వైద్య సేవలను పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు ఒక బలమైన వ్యవస్థగా ఉపయోగపడుతుందన్నారు. ఈ ట్రస్ట్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యాంక్ ఖాతాను తెరుస్తామని, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి సమాన ఆర్థిక సహకారంతో దీనిని నిర్వహిస్తామని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, ఒక స్థిరమైన, జవాబుదారీతనంతో కూడిన వైద్య విధానాన్ని తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి, ట్రస్ట్ తుది మార్గదర్శకాల్లో వాటిని పొందుపరుస్తామని వెల్లడించారు. కాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వాగతించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బెన్హర్ మహేష్ ఎక్కా, దాన కిషోర్, ముఖ్యకార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శి యోగితా రాణా, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఏలూరి శ్రీనివాసరావు ( టిజిఒ), ఎం.జగదీశ్వర్,(టిఎన్‌జిఒ), వి.లచ్చిరెడ్డి (టిజిఇజెఎసి), ఎస్.రాములు(తహసీల్దార్ల అసోసియేషన్), సదానందంగౌడ్ (ఎస్‌టియు టిఎస్), చావరవి (టి.ఎస్.యుటిఎఫ్), వి.రాజశేఖర్, పెంటయ్య, డి.సైదులు, తదితర పలు ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు.

**అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతనే 'కాంట్రిబ్యూషన్' తీసుకోండి : ఎస్‌టియు**

నూతన హెల్త్ స్కీముకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను రూపొందించి,అధికారిక ఉత్తర్వులను జారీ చేసినతర్వాత ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ డిడక్షన్లు ప్రారంభించాలని ఎస్‌టియు టిఎస్ అధ్యక్షుడు జి.సదానందం గౌడ్,ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్‌రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గత సమావేశంలో ప్రతిపాదించిన మూల వేతనంలో 1.5 శాతం కాంట్రిబ్యూషన్‌ను పునఃసమీక్షించాలని, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే, వారిని ఒకే కుటుంబంగా గుర్తించి, ఒక్కరి నుంచే కాంట్రిబ్యూషన్ డిడక్షన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పిల్లలకు హెల్త్ కార్డుల విషయంలో ప్రస్తుతం ఉన్న 25 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితిని తొలగించి, జీవితకాలం హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. సిపిఎస్ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందిన అనంతరం, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డుల వర్తింపుపైన స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయాలన్నారు.

**1.5 శాతం కోత విధించే ప్రతిపాదనను పునఃపరిశీలించండి : లచ్చిరెడ్డి**

ప్రాథమిక వేతనంపై 1.5 శాతం కోత విధించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని టిజిఇజెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి కోరారు. ఉద్యోగులను ఈహెచ్‌ఎస్‌లో పొందుపర్చే ముందే ప్రభుత్వ ఆ వివరాలను ప్రచురించాలని, ఈహెచ్‌ఎస్ పూర్తి మార్గదర్శకాలను, అమలు విధానాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల జాబితాను అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య సేవల వివరాలు, చికిత్సల ప్యాకేజీల వివరాలను కూడా వెల్లడించాలని కోరారు.

## నేడు మూడు ఉద్యోగ నోటిఫికేషన్లు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ మంగళవారం మూడు ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ప్రకటించింది. రాష్ట్రపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఇకపైన ప్రతినెలా నోటిఫికేషన్లను జారీ చేస్తామని, కంప్యూటర్ ఆధారితన పరీక్షలను నిర్వహిస్తామని వెల్లడించింది. హైదరాబాద్‌లోని టిజిపిఎస్‌సి కార్యాలయంలో టిజిపిఎస్‌సి కమిషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎండి రియాజుద్దీన్ రాథోడ్, విష్ణు ప్రసాద్, డాక్టర్ అనిల్ ఉపాధ్యాయ్, కార్యదర్శి హరితతో కలిసి చైర్మన్ బుర్రా వెంకటేశం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుందని, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3,800 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందన్నారు. కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులు, రోడ్డు భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పోస్టులకు, అలాగే 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు వివరించారు. రానున్న నోటిఫికేషన్లలో అత్యధికంగా ఆటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు 1393 ఉన్నాయన్నారు. ఈ నెలలోనే మరో మూడు నోటిఫికేషన్లు జారీ చేయనున్నామని, వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డిఇఒ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని ఆయన చెప్పారు. కేవలం డిగ్రీ స్థాయి పోస్టులకు మాత్రమే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) నిబంధనల మేరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని, భవిష్యత్తులో రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భారీ సంస్కరణలు తీసుకొస్తున్నామని వివరించారు.

**కంప్యూటర్ ఆధారిత పరీక్షలు :**

భవిష్యత్‌తో ఒఎంఆర్ విధానంలో పరీక్షలను నిర్వహించకుండా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ విధానంలో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులకు మార్కులు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు తాము నిర్వహించిన పరీక్షలను పరిశీలించి, లీకేజీలకు తావు లేకుండా పూర్తి స్థాయిలో కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రం ఒక రోజు ముందు, లేదా కొన్ని గంటల ముందుగానే ప్రశ్నపత్రాలను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకురానున్నామని ఆయన చెప్పారు. ప్రతి రెండు, మూడు నెలలకు ఫలితాలను ప్రకటిస్తామని, మూడు నుంచి గరిష్టంగా 6 నెలల కాలంలో ఉద్యోగాల్లో చేరే విధంగా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణపై రాష్ట్రవ్యాప్త టిజిఎఫ్‌డిసి ఉద్యమం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 1 నుంచి 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగనుంది. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, జీవ వైవిధ్య సంరక్షణ, ప్రజల్లో పర్యావరణ బాధ్యత పెంపొందించడం లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఎఫ్‌డిసి అధికారులు, ఎకోటూరిజం విభాగ ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 'డాఫాబెట్' అక్రమ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

దేశవ్యాప్తంగా విస్తరించిన ఆన్‌లైన్ బెట్టింగ్ నెట్‌వర్క్‌పై భారీ ఆపరేషన్

11 మందిని అరెస్టు చేసిన సిఐడి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవస్థలపై సిఐడి ఉక్కుపాదం మోపింది. ఈ క్రమంలోనే సిఐడి అధికారులు దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న డాఫాబెట్ నెట్‌వర్క్‌ను ఛేదించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం నిర్వహించిన ఆపరేషన్‌లో గుజరాత్, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన 11 మంది కీలక నిందితులను అరెస్ట్ చేసినట్లు సిఐడి డిజి చారుసిన్హా వెల్లడించారు. తన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చల్లా సాయి కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు వెలుగులోకి వచ్చిందని తెలిపారు. డాఫాబెట్ యాప్ ప్రచారాలను నమ్మి 2024 జనవరి నుంచి 2025 జనవరి వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొన్న ఆయన మొత్తం రూ.9.95 లక్షలు కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన సిఐడి ప్రత్యేక దర్యాప్తు బృందం, బాధితుడి డబ్బు 46 మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా ఎనిమిది స్థాయిల్లో మళ్లింపులు జరిగినట్లు గుర్తించామన్నారు. ఫోరెన్సిక్ విచారణలో బ్యాంక్ లావాదేవీలు, మొబైల్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు, సోషల్ మీడియా అకౌంట్లు, వాట్సాప్ గ్రూపుల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్‌ను బయటపెట్టిందని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, క్యాసినో గేమ్స్, ఏవియేటర్ వంటి గేమింగ్ ప్లాట్‌ఫార్మ్‌ల పేరుతో యువతను ఆకర్షిస్తూ భారీగా డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ప్రారంభంలో చిన్న మొత్తాల్లో గెలుపులు చూపించి, తర్వాత భారీగా డబ్బులు పెట్టేలా ప్రలోభపెట్టినట్లు అధికారులు తెలిపారు. సిఐడి ఏర్పాటు చేసిన ఆరు ప్రత్యేక బృందాలు రెండు వారాల పాటు ఢిల్లీ, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల్లో నిఘా నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశాయి. వీరిలో కొందరు నకిలీ కంపెనీలు సృష్టించి అక్రమ డబ్బును స్వీకరించగా, మరికొందరు మ్యూల్ అకౌంట్లు ఏర్పాటు చేయడం, సాంకేతిక సహాయం అందించడం వంటి పనులు నిర్వహించినట్లు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి మూడు లగ్జరీ కార్లు, 8 ల్యాప్‌టాప్‌లు, రెండు ఐప్యాడ్లు, 26 మొబైల్ ఫోన్లు, 5 పాస్‌పోర్టులు, రూ.3.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే 225 ఫిర్యాదులు, 73 కేసులు నమోదైనట్లు ఎన్‌సిఆర్‌పి డేటా ద్వారా వెల్లడైంది. ఇక తెలంగాణలో అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 414 కేసులు నమోదు చేయడంతో పాటు, 108 బెట్టింగ్ యాప్‌లను బ్లాక్ చేయించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరో 37 యాప్‌లపై జియోఫెన్సింగ్ అమలు చేశారు.ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న పోలీసులు.. ఇలాంటి ప్లాట్‌ఫార్మ్‌లకు దూరంగా ఉండాలని ప్రజలకు హెచ్చరించారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

సిట్ విచారణకు హాజరైన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



ప్రజాపక్షం/-హైదరాబాద్ : గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీకనివాసరెడ్డి, ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్న సిట్ అధికారులు, ఆయనతో పాటు జడ్చర్ల ఎంఎల్‌ఎకి 160 సిఆర్‌పిసి కింద నోటీసులు జారీ చేయగా.. ఇద్దరు ఎంఎల్‌ఎలు బంజారాహిల్స్‌లోని ఐసిసిసి కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల అనంతరం తమ ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపిస్తూ ఇద్దరు ఎమ్మెల్యేలు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని విచారించిన సిట్ అధికారులు, ఎన్నికల సమయంలో వీరిద్దరి ఫోన్లు ట్యాప్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి ఏ ఆధారాలపై ఫిర్యాదు చేశారన్న అంశంపై అధికారులు లోతుగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఒకసారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చినా, అనివార్య కారణాలతో హాజరు కాలేకపోయామని ఎమ్మెల్యేలు తెలిపిన నేపథ్యంలో మరోసారి నోటీసులు జారీ చేశారు. ఇద్దరు ఎమ్మెల్యేల ఫిర్యాదుల ఆధారంగా సిట్ సేకరించిన సాక్ష్యాధారాలను వారి ముందు ఉంచి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. విచారణలో ఇచ్చే స్టేట్మెంట్లను సిట్ అధికారులు అధికారికంగా రికార్డు చేయనున్నారు. సిట్ విచారణ అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడే అవకాశం ఉండటంతో.. వారు వెల్లడించే వివరాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## ఖరీఫ్‌లో ఎరువుల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండ ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా సరఫరా, రవాణా అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తోందని తెలిపారు. ఎరువుల తరలింపు, కేటాయింపులు, రవాణకు సంబంధించి కేంద్ర మంత్రులకు రాసిన లేఖలపై వారు సానుకూలంగా స్పందించారని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో యూరియా అవసరం కూడా గణనీయంగా పెరిగిందని, అందుకు అనుగుణంగా నెలకు 10 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న కేటాయింపును 11.5 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాను మంత్రి తుమ్మల కోరారు. అలాగే రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సిఎల్) నుంచి తెలంగాణకు ప్రత్యేకంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర రసాయన మరియు ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్ర అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని హామి ఇచ్చారని మంత్రి తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి అయ్యే యూరియాను జాతీయ స్థాయిలో పూల్ విధానం ద్వారా అన్ని రాష్ట్రాలకు సమానంగా పంపిణీ చేస్తున్నందున, ఆర్‌ఎఫ్‌సిఎల్ ఉత్పత్తిని ఒక్క తెలంగాణకే ప్రత్యేకంగా కేటాయించడం సాధ్యం కాదన్నారని వెల్లడించారు. అయితే రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశీయ ఉత్పత్తి, దిగుమతుల ద్వారా అవసరమైన మేర యూరియా సరఫరా నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

## కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. దళిత సమాజాన్ని కాంగ్రెస్ పార్టీ వైపు మరింతగా ఆకర్షించే విధంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ప్లాజా హోటల్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించబడింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరై, రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. టిపిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించి కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కవంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో భారీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ఎస్‌సి సెల్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన ఎస్‌సి విభాగంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేసి దళితుల సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, దళిత సాధికారత, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ప్రజా సమస్యల పరిష్కారం, రాబోయే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
02-06-2026
www.prajapaksham.in

'జూన్ 2' తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం ఆవిష్కృతమైన చారిత్రక దినం. దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు చేసిన త్యాగాలకు ప్రతిఫలంగా ఏర్పడింది తెలంగాణ రాష్ట్రం. ఇది కేవలం ఒక రాష్ట్ర ఆవిర్భావ వేడుక మాత్రమే కాకుండా ప్రజల స్వీయ పాలన ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన రోజు.






















































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com